శుక్రవారం
20-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 269
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పుతిన్ ప్రతిపాదనకు ట్రంప్ నో

మాస్కో: ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చిన క్రమంలో సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని రష్యా తెలిపింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యంగ్యంగా స్పందించారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించుకున్న తర్వాత ఇరాన్ గురించి మాట్లాడండి అంటూ వ్యాఖ్యానించారు. 'నేను పుతిన్‌తో మాట్లాడా. ఆయన ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తానన్నారు. ముందు ఉక్రెయిన్‌తో రాజీ కుదుర్చుకోండి. యుద్ధాన్ని ఆపండి. ఆ తర్వాత ఇజ్రాయిల్-ఇరాన్ గురించి ఆలోచిద్దాం అని పుతిన్‌కు సూచించా' అని శ్వేతసౌధం వద్ద విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ వెల్లడించారు.

విశ్లేషణ కోసం అమెరికాకు బ్లాక్‌బాక్స్

అహ్మదాబాద్: గుజరాత్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అందులోని డేటాను విశ్లేషించేందుకు దాన్ని విదేశాలకు పంపించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ సమాచారాన్ని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియాల్లో కథనాలు వెల్లడించాయి. ప్రమాదం అనంతరం స్థానిక బీజే వైద్య కళాశాల భవనంపై నుంచి అధికారులు దీన్ని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ప్రమాద సమయంలో బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో దాని నుంచి

- మిగతా 2 లో

కొత్తింటికి రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ త్వరలోనే కొత్త నివాసానికి మారబోతున్నారు. ఢిల్లీలోని సున్‌హరీబాగ్ రోడ్డులోని బంగ్లా నంబర్ 5 ఇకపై ఆయన కొత్త చిరునామాగా మారనుంది. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా సామాన్ల తరలింపు ప్రక్రియ మొదలైంది. జులై 21 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఆయన ఈ బంగ్లాకు మారతారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. తన అధికారిక నివాసంగా ఈ బంగ్లా నంబర్-5ను రాహుల్ గాంధీ అంగీకరించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. రాహుల్‌కు

- మిగతా 2 లో

నేడు విశాఖకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 20, 21 తేదీల్లో మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు అధికారికంగా ప్రధాని కార్యాలయం ప్రకటించింది. బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఒడిశాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరవుతున్నారు. 21వ తేదీన

- మిగతా 2 లో

యుద్ధం తీవ్రతరం

ఇజ్రాయిల్‌పై విరుచుకుపడిన ఇరాన్

- బాంబులతో దద్దరిల్లిన టెల్ అవీవ్, జెరూసలేం
- ఖామేనీయే లక్ష్యమంటున్న నెతన్యాహు
- ఇంటెలిజెన్స్ కేంద్రాలపై తెహ్రాన్ క్షిపణి దాడులు
- దెబ్బతిన్న స్టాక్ ఎక్ఛేంజ్, సొరోక మెడికల్ సెంటర్

తెహ్రాన్/టెల్‌అవీవ్: ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధం రోజురోజుకు తీవ్రతరమవుతోంది. ప్రపంచ దేశాలు విన్నవిస్తున్నప్పటికీ ఆ రెండు దేశాలు ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రెండు దేశాలు పరస్పరం భీకర దాడులకు పాల్పడుతున్నాయి. ఇజ్రాయిల్ కీలక సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయిల్‌కు భారీగా నష్టం సంభవించింది. మరోవైపు, ఇజ్రాయిల్ సైతం వెనక్కి తగ్గడం లేదు. కాగా, ఇజ్రాయిల్‌కు సంబంధించిన ఏ లక్ష్యాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఎలాంటి పరిమితులు పెట్టుకోబోమని ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయిల్‌పై మరిన్ని దాడులు చేస్తామని హామీ ఇస్తున్నా అంటూ ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ మేజర్ జనరల్ అబ్దుల్‌రహీం మౌసవీ ఒక ప్రకటన చేశారు. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ ఏరోస్పేస్ స్థావరాల సంధ్యన సమయంలో యుద్ధ సన్నద్ధతను ప్రశంసిస్తూ, సైనికుల నిబద్ధతను మెచ్చుకున్నారు. వారి మనోధైర్యాన్ని పెంచారు. ఇజ్రాయిల్ లక్ష్యాలను ధ్వంసం చేస్తున్న ఏరోస్పేస్ దళాన్ని అభినందించారు. కొత్త 'సెజ్జిల్' రకానికి చెందిన శక్తిమంతమైన క్షిపణులతో ఇజ్రాయిల్‌పై ఇరాన్ ఏడవ రోజు భీకర దాడులు కొనసాగించింది. టెల్ అవీవ్, జెరూసలేం దద్దరిల్లిపోయాయి. బాలిస్టిక్ క్షిపణులతో టెల్ అవీవ్ ఇంటెలిజెన్స్ కేంద్రాలు, స్టాక్ ఎక్ఛేంజ్ భవనంపై విరుచుకుపడింది. ఈ పేలుళ్ల ధాటికి అక్కడి పెద్ద ఆసుపత్రి సొరోక మెడికల్ సెంటర్‌కు తీవ్ర నష్టం జరిగింది. 40 మందికి గాయాలయ్యాయి. ఈ ఆసుపత్రిపై ఇరాన్ నేరుగా దాడి చేసినట్లు తొలుత వార్తలు వచ్చాయి కానీ ఇరాన్ లక్ష్యం ఇంటెలిజెన్స్ కేంద్రాలేగానీ ఆసుపత్రి కాదని అధికారిక మీడియా పేర్కొంది. అమెరికా జోక్యంతో యుద్ధం విస్తృతమవుతుందని ఇరాన్ మరోమారు హెచ్చరించింది. జియోనిస్ట్ పాలనకు మద్దతిస్తే తమ దేశాన్ని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం అమెరికా, ఇజ్రాయిల్‌కు బుద్ధి చెప్పేందుకు ఇరాన్ తన అస్త్రాలు బయటకు తీయాల్సివస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఖాజెమ్ ఘరీబాబాదీ వెల్లడించారు. సైనికపరమైన నిర్ణయాధికారులు ఇప్పటికే తమకున్న అన్ని అవకాశాలపై అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. గురువారం ఇజ్రాయిల్ సైన్యానికి చెందిన సీ 41 టెలీకమ్యూనికేషన్స్ కార్ప్స్ కేంద్ర కార్యాలయాలు, ఇంటెలిజెన్స్ కేంద్రం 'ఐఆర్ఎన్ఏ'పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడిందని, పేలుళ్ల ధాటికి ఆసుపత్రికి నష్టం జరిగినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. బీర్షెబాలోని సొరోక మెడికల్ సెంటర్‌పై ఇరాన్ క్షిపణి దాడితో తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఇజ్రాయిల్ అధికారులు పేర్కొన్నారు. కిటికీల అద్దాలు ధ్వంసం కావడం, ఆ ప్రాంతాన్ని నల్లటి పొగమంచు కమ్మేయడం వంటి దృశ్యాలను ఇజ్రాయిల్ మీడియా ప్రసారం చేసింది. ఇరాన్‌లోని అరక్ హెవీ వాటర్ ఫెసిలిటీపై ఇజ్రాయిల్ దాడి చేసింది. దాడికి ముందే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. దీంతో లీకేజి ముప్పు లేదు. నటాన్జ్ ప్రాంతంలోని అణ్వస్త్రాల తయారీ కేంద్రంపైనా వైమానిక దాడులు జరిపింది. 40 ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు ఇరాన్‌లోని డజన్ల కొద్దీ లక్ష్యాలపై దాడులు చేసినట్లు సైన్యం తెలిపింది.

భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే: నెతన్యాహు

తమ దేశంలోని సొరొకో ఆసుపత్రిపై దాడికిగాను ఇరాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తాజా హెచ్చరికలు చేశారు. 'ఈరోజు ఉదయం ఇరాన్‌లోని ఉగ్రవాద

- మిగతా 2 లో

ఇంజినీరింగ్

ఫీజుల పెంపు లేనట్టే!

- ప్రతిపాదనలు ప్రభుత్వం తిరస్కరణ
- అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇంజినీరింగ్ ఫీజులు పెరుగతాయనే ఆందోళలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ప్రతి ఏటా ఆయా విద్యా సంస్థల ఫీజుల పెంపును తప్పుపట్టినట్లు తెలిసింది. తాజాగా ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి వెళ్లగా తిరస్కరించినట్లు సమాచారం. ఫీజుల అధ్యయనానికి ఓ కమిటీ వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇప్పటికే ఫీజుల అంశంపై భేటీ అయిన టీఏఎఫ్ఆర్సీ, ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఈ ఏడాది పాత ఫీజులతోనే ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. జులై మొదటి వారంలో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సిలింగ్ జరగనున్న తరుణంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి మూడేళ్లకు కొత్త ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. కానీ సీఎం ఆదేశాలతో కాలేజీల తీరు, 2016 నాటికి టాస్క్‌ఫోర్స్ నివేదికలు, ఫీజుల పెంపు ప్రతిపాదనలపై అధ్యయన కమిటీ వేయనున్నట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది. కాలేజీల్లో వసతులు, నిబంధనల అమలుపై నాటి టాస్క్‌ఫోర్స్ నివేదికలు బయటపెట్టాలని సర్కారు ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడు కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 174 ఇంజినీరింగ్ కళాశాలలు ఉంటే అందులో 155 ప్రైవేటువే ఉడడం గమనార్హం. వీటిలో నాలుగు కాలేజీలకు ఏఐసీటీయూ అనుమతులు రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రస్తుతానికి ఫీజుల పెంపుదలకు బ్రేక్ పడడంతో ప్రైవేటు ఇంజినీరింగ్ యాజమాన్యాలకు మింగుడుపడడం లేదు. కౌన్సిలింగ్ సమయానికి అధ్యయనం పూర్తైయితే కొంతమేర ఫీజులు పెరిగే అవకాశాలు ఉన్నప్పటికీ ఇంత తక్కువ సమయంలో అధ్యయనం అంత సులువు కాదనే చెప్పాలి.

'బనకచర్ల'ను అడ్డుకోండి

- ఇది తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధం
- జీడబ్ల్యూడీటీని, పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఏపీ
- కేంద్రం అనుకూలంగా లేకుంటే సుప్రీం కోర్టుకెళతాం
- జలశక్తి మంత్రి పాటిల్‌తో రేవంత్, ఉత్తమ్

విశాలాంధ్ర-హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నొక్కిచెప్పారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శ్రమశక్తి భవన్‌లో గురువారం కేంద్ర మంత్రిని కలిసి, బనకచర్ల ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలను రేవంత్, ఉత్తమ్ తెలిపారు. ఏపీ ప్రతిపాదన తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. జీడబ్ల్యూడీటీ, పునర్విజన చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ఉల్లంఘిస్తోందని అన్నారు. అలాగే, గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ఏపీ నుంచి బ్లాంకెట్ ఎన్‌వోసీ ఇప్పించాలని కోరారు. మూసీ పునరుజ్జీవనానికి నిధులు అడిగారు. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు, అన్ని అనుమతుల మంజూరీకి విజ్ఞప్తి చేశారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్-1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014కు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖల తీరుతో తెలంగాణ ప్రజలు, రైతులు ఆందోళనకు గురవుతున్నారని సీఎం తెలిపారు. 'గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోంది. జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల గురించి ప్రస్తావించడంలేదు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా కొత్త ప్రాజెక్టు కట్టాలంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి

- మిగతా 2 లో

మెట్రో రెండో దశకు అనుమతివ్వండి

కేంద్ర మంత్రికి రేవంత్ వినతి

2 లో

ఇద్దరం వాడుకుందాం

- సముద్రంలో కలిసే నీటిపై సమస్య సృష్టించడమెందుకు?
- దీనికి పోరాటాలెందుకు... ప్రాజెక్టులు కట్టి నీళ్లు తీసుకెళ్లండి
- బనకచర్ల ప్రాజెక్టుపై చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సముద్రంలో కలిసే నీటిపై సమస్య సృష్టించడం సమంజసం కాదని, గోదావరి జలాలను రెండు రాష్ట్రాలూ పూర్తిగా సద్వినియోగం చేసుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరంపై వివరణ ఇచ్చారు. గోదావరిలో నీళ్లను ఇప్పటికే రెండు రాష్ట్రాలు వాడుతున్నాయి. పోలవరం తప్ప మిగతావి అనుమతి రాని ప్రాజెక్టులే. విభజన చట్టంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. గోదావరి ప్రవాహంలో చిట్టచివరి రాష్ట్రంగా వచ్చిన నీటిని మరో బేసిన్‌కు తరలిస్తున్నాం. గతంలో కృష్ణా బ్యారేజ్‌పై రెండు రాష్ట్రాల సిబ్బంది గొడవ పడ్డారు. గవర్నర్ వద్ద కూర్చొని గతంలో సమస్య పరిష్కరించుకున్నాం. కృష్ణాలో తక్కువ ఉన్న నీటిపై గొడవ పడితే లాభం లేదు. ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులను అలాగే కొనసాగిద్దాం. కొత్త ట్రిబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను చాలా ప్రాజెక్టులు మొదలుపెట్టాను. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టులు ప్రారంభించాను. ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వివాదం వస్తే అసెంబ్లీలో పోరాడాం. కాళేశ్వరం గురించి ఎప్పుడూ తాను అభ్యంతరం చెప్పలేదు. రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి వాడుకునే నీటిపై ఎందుకు వివాదాలు పెట్టుకోవాలి. సముద్రంలో కలిసే నీటి వాడకంపై చట్టబద్ధత కావాలంటే కేంద్రంతో చర్చిద్దాం. సముద్రంలో కలిసే నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంతవరకు సమంజసం? రెండు రాష్ట్రాల జల వివాదాల వల్ల ఎలాంటి లాభం లేదు. వివాదం సృష్టిస్తే ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది. ఈ

- మిగతా 2 లో

'బనకచర్ల' బయటపెట్టిందే బీఆర్ఎస్

- 'బేసిన్ల'పై రేవంత్‌కు అవగాహన లేమి
- తెలంగాణను సంప్రదించకుండా కృష్ణా-గోదావరి అనుసంధానం కుదరదు
- జగన్‌తో ఏం మాట్లాడామో బయటపెట్టండి: హరీశ్‌రావు

2 లో

ఇదీ లోకం!

సార్సార్! నా పెర్ఫార్మెన్స్ చూడండి!

ఇజ్రాయిల్‌కు మద్దతివ్వొద్దు

- అమెరికా కాన్సులేట్ వద్ద ధర్నాలో సీపీఐ డిమాండ్
- అడ్డుకున్న పోలీసులు: నేతల అరెస్టు

2 లో

అమెరికా కర్రపెత్తనాన్ని అడ్డుకుందాం

- ఆయుధ వ్యాపార విస్తరణకు దేశాల మధ్య చిచ్చు
- ట్రంప్ చర్యలకు వ్యతిరేకంగా మోదీ నోరువిప్పాలి
- పలస్తీనా ప్రజలకు యావత్ ప్రపంచం అండగా నిలవాలి: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: ఆయుధ వ్యాపారాన్ని విస్తరించుకునే దుష్ట పన్నాగంతోనే అరబ్, పశ్చిమాసియా దేశాల మధ్య చిచ్చుపెడుతూ, యుద్ధాలకు అమెరికా ప్రేరేపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఈ పరిణామాలు ట్రంప్ సామ్రాజ్య వాద కాంక్షకు తాజాగా మొదలైన ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం

- మిగతా 2 లో

మళ్లీ పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్

న్యూయార్క్: స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన పదో స్టార్‌షిప్ మరోసారి పేలిపోయింది. టెక్సాస్‌లోని స్పేస్‌ఎక్స్ టెస్టింగ్ కేంద్రంలో సాధారణ పరీక్షల్లో భాగంగా నిర్వహించిన ఫైర్ టెస్ట్ సమయంలో ఈ ఘటన జరిగింది. పేలుడు ధాటికి పరీక్షా కేంద్రం కుదుపునకు లోనైంది. సంబంధిత దృశ్యాలు వైరలయ్యాయి. భారీ శబ్దాలతో పెద్ద ఎత్తున మంటలు, పొగ వెలువడిన దృశ్యాలు ఆ వీడియోల్లో కనిపించాయి. స్టార్‌షిప్ ప్రోటోటైప్‌కు తీవ్ర నష్టం వాటిల్లినట్లు స్పేస్‌ఎక్స్ వర్గాలు తెలిపాయి. పరిశీలన దశలోనే స్టార్‌షిప్ పేలిపోయినట్లు స్పెస్ ఎక్స్ సహా టెక్సాస్ అధికారులు ధ్రువీకరించారు. ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు. పేలుడుకుగల కారణాలపై స్పేస్‌ఎక్స్ దర్యాప్తు ప్రారంభించింది. రాకెట్ ఇంజిన్ల పని తీరును, వాటిలోని ఇంధన వ్యవస్థలను, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పరీక్షించడానికి స్టాటిక్ ఫైర్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఈ పరీక్ష సమయంలో పేలుడు సంభవించడంతో స్పేస్‌ఎక్స్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది షాకయ్యారు. సమస్యను పరిష్కరించడంలో నిమగ్నమయ్యారు.

జైలులోనే సూకీ జన్మదినం

నే పీ దా: మైన్మార్‌లో జుంటా ప్రభుత్వం నిర్బంధించిన డెమొక్రటిక్ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీ గురువారం 80వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఆమె యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తున్నారు. సూకీ 1945 జూన్ 19న జన్మించారు. మైన్మార్‌లో ప్రజాదరణ పొందిన నాయకురాలు ఆమె. సూచీ మానవ హక్కుల కార్యకర్త కూడా. 1991లో శాంతి నోబెల్ పురస్కారం అందుకున్నారు. 2016 నుంచి 2021 వరకు మైన్మార్ స్టేట్ కౌన్సిలర్‌గా, విదేశాంగ మంత్రిగా పనిచేశారు. 2021లో సైనిక తిరుగుబాటు తర్వాత ఆమెను జుంటా నిర్బంధించింది. అవినీతి తదితర ఆరోపణలతో ఆమెకు 27 ఏళ్ల శిక్ష విధించింది.

అమ్మ ఎలా ఉందో తెలియదు: కిమ్ ఆరిస్

'అమ్మ పుట్టిన రోజును వేడుక చేసేకునే పరిస్థితి లేదు. ఈ బాధ అలవాటైపోయింది' అని బ్రిటన్‌లో ఉండే సూకీ కుమారుడు కిమ్ ఆరిస్ (47) అన్నారు. తన తల్లి 80వ పుట్టినరోజును పురస్కరించుకొని రోజుకు 80 కిమీలు చొప్పున 8 రోజులు పరిగెత్తి, 80వేల మంది ఆశీస్సులను పొందారు. ఇదంతా వీడియో తీశారు కానీ వాటిని సూకీ చూడలేరు. నిర్బంధానికి గురైనప్పటి నుంచి రెండేళ్ల కిందట ఒక్కసారి మాత్రమే తన తల్లి వద్ద నుంచి సందేశం అందిందని ఆరిస్ చెప్పారు. అమ్మ ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో కూడా తెలియదంటూ ఆవేదన వ్యక్తంచేశారు. గుండె, ఎముకలు, చిగుళ్ల వ్యాధితో బాధపడుతున్న ఆమెకు వైద్యం కూడా అందడం లేదన్న భయం ఉందని ఆరిస్ చెప్పారు.

'బనకచర్ల' బయటపెట్టిందే బీఆర్‌ఎస్

విశాలాంధ్ర-హైదరాబాద్: ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలో ఉన్న బేసిన్లపై కనీస అవగాహన లేకపోవడం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. అఖిలపక్ష సమావేశంలో అసలు విషయాన్ని పక్కనపెట్టి ఏవేవో మాట్లాడిన సీఎంకు బేసిన్‌లపై బేసిక్ నాలెడ్జ్ కూడా లేదనే విషయం స్పష్టంగా అర్థమైందన్నారు. బనకచర్లపై అఖిలపక్ష సమావేశం అనంతరం మీడియా సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీఎంకు బ్యాగుల మీద మంచి అవగాహన ఉన్నట్టుంది గాని బేసిన్లపై లేదనే విషయం స్పష్టం అయిందన్నారు. అఖిలపక్ష సమావేశం పెట్టి మరీ రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారని విమర్శించారు. దేవాదుల ఏ బేసిన్ లో ఉందో తెలియదు, బనకచర్ల ఏ బేసిన్లో కడుతున్నారో తెలియదంటే అసలు రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అంటూ ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెకుపై ఆంధ్రప్రదేశ్ ఆరు నెలలుగా పనిచేస్తుంటే సీఎం ఇలా అమాయకమైన ప్రశ్నలు అడగడం విడ్డురం అన్నారు. అక్రమ ప్రాజెక్టును ఆపవయ్యా రేవంత్ రెడ్డి అంటే ... అబద్దాల ప్రవాహాన్ని పారించారని విమర్శించారు. దేవాదుల కూడా గోదావరి బేసిన్ కదా అని కొత్తగా అడుగుతున్నారని చురకలు అంటించారు. ఆయనకంటే ఓ ఆకు ఎక్కువే చదివిన సీఎం సలహాదారుడు ఆదిత్యా దాస్ ... బనకచర్ల ప్రకాశం జిల్లాలో ఉంది అంటాడని వాస్తవానికి అది ఉన్నది నంద్యాల జిల్లాలో అనే విషయం వారు గుర్తించాలన్నారు. బనకచర్ల విషయంలో ప్రభుత్వ మొద్దునిద్ర లేపిందే బీఆర్‌ఎస్ పార్టీ అని అన్నారు. గోదావరిలో వెయ్యి, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి ఎంతైనా తీసుకుపో అంటున్నారని, ఈ విషయాన్ని మీరెలా చెబుతారని ధ్వజమెత్తారు. ప్రెజెంటేషన్‌లోనే సుబ్రమణ్య ప్రసాద్ ... 968 టీఎంసీలకు తెలంగాణలో ప్రాజెక్టుగా రూపకల్పన జరిగిందని, అందులో 946 టీఎంసీలు హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చింది అని చెప్పిందని గుర్తు చేశారు. చంద్రబాబు ఇచ్చేది ఏంది వెయ్యి టీఎంసీలు.... తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే 968 టీఎంసీలు కేటాయిస్తూ జీవోలు ఇచ్చారని వెల్లడించారు. 750 టీఎంసీల నీళ్లు రావాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్రం తరఫున వాదించామని, సెక్షన్ 3 కోసం పోరాడింది కేసీఆర్ అని, కృష్ణాలో తాత్కాలిక ఒప్పందం ప్రకారం మనకు 299 టీఎంసీలే వచ్చాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ప్రాజెక్టులు కట్టకపోవడం వల్ల నీటి కేటాయింపులు చేయకపోవడం వల్ల నిర్ణయం జరిగిందని ఆరోపించారు. అన్ని కలిపి 763 టీఎంసీలు కృష్ణా బేసిన్లో తెలంగాణకు రావాలని ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ ఫైల్ చేసిందన్నారు. ప్రతి సంవత్సరం 3000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని సెంట్రల్ వాటర్ కమిషన్ చెప్తుందని, ఈ నీటిని రెండు రాష్ట్రాలు ఎలా ఉపయోగించుకోవాలి అనే అంశంపై ఇద్దరు కూర్చొని మాట్లాడుకోవాలని రెండు రాష్ట్రాలకు లాభం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారని వివరించారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధాన విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లో ముందుకు పోయే అవకాశం లేదన్నారు. జగన్‌తో ఏమి మాట్లాడామో అజెండా ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

మెట్రో రెండో దశకు అనుమతివ్వండి

విశాలాంధ్ర-హైదరాబాద్: నగరంలో మెట్రో రెండో దశకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నివాసంలో గురువారం సీఎం సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండో దశ అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మెట్రో రెండో దశ సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని... సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఖట్టర్‌కు తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. మెట్రో రెండో దశ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్-2047 విజన్ అద్భుతం: టోనీ బ్లెయిర్

తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997-2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా, సుదీర్ఘకాలం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన బ్లెయిర్ రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన... వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో ఆయన ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్‌ను స్థాపించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. తెలంగాణలో రైతులు, యువత, మహిళలు, విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సీఎం...టోనీ బ్లెయిర్‌కు వివరించారు. పట్టణ, శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను ఆయనకు తెలియజేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబరు 9న ప్రజలకు వెల్లడించనున్నట్లు సీఎం తెలిపారు. స్పందించిన బ్లెయిర్... సుస్థిరాభివృద్ధి దిశగా రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని ప్రశంసించారు. ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ వంటి ప్రాజెక్టులపై టోనీ బ్లెయిర్ ఆసక్తి చూపారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టీబీఐజీసీ ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని పరస్పరం మార్చుకున్నారు.

ఇజ్రాయిల్‌కు మద్దతివ్వొద్దు

హైదరాబాద్: పలస్తీనాలో దురాక్రమణను ప్రోత్సహిస్తూ, ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని వామపక్ష నాయకులు వ్యతిరేకించారు. అమెరికా తీరును నిరసిస్తూ తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. 'ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు ఇవ్వొద్దు. తక్షణమే యుద్ధం ఆగాలి' అని నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.

పలస్తీనా ప్రజల మారణహోమాన్ని తక్షణమే ఆపాలని ఐక్యంగా గళం వినిపించారు. అమెరికాకు, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు ఇస్తూ, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. అమాయక పలస్తీనా పౌరులు, ముఖ్యంగా పిల్లల రక్తపాతాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే దాడులు ఆపాలని, ఇజ్రాయిల్‌కు సహాయాన్ని అమెరికా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా నిర్వహించిన నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. అనేక మంది నాయకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని వ్యాన్లలో ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టైన నాయకుల్లో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహా తదితరులున్నారు.

నేడు విశాఖకు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి పాలుపంచుకోనున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ కేంద్రంగా మోదీ నేతృత్వం వహించనున్నారు. 21వ తేదీన ఉదయం 6.30 గంటలకు యోగా అనంతరం మోదీ ప్రసంగించనున్నారు. విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించే యోగా కార్యక్రమానికి సామాన్య ప్రజలతో కలిసి మోదీ పాల్గొంటారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది హాజరవుతారని ప్రధాని కార్యాలయం తెలిపింది.

'బనకచర్ల'ను అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షతన సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి, అనుమతి పొందాలి. బనకచర్ల విషయంలో అలా జరగడంలేదు. ఏపీ ఏ నిబంధనలు పాటించడం లేదు. వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామనడం అభ్యంతరకరం' అని రేవంత్ అన్నారు. ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్ర మంత్రిని కోరారు. సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి అనుమతులు లేకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకట నగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని వెల్లడించారు. జీడబ్ల్యూడీటీ-1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్చి, పర్యావరణ అనుమతు లకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, జాతీయ ప్రాజెక్టు కాబట్టి ఎలాంటి ఉల్లంఘనలు జరగ కుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. పోలవరం-బనకచర్లకు బదులు ఇచ్చంపల్లి-నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లడంపై ఏపీతో చర్చకు సిద్ధమని సీఎం తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలన్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీ పడమని, సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుంటామని రేవంత్ తెలిపారు. కేంద్రం నుంచి అనుకూల స్పందన రాకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని... అవి తమకు కేటాయించిన తర్వాత ఏపీ ప్రాజెక్టులకు అనుమతులను పరిశీలిస్తే అభ్యంతరం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వర స్పందన... తెలంగాణ విషయంలో అలసత్వం తగదన్నారు. గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని సీఎం కోరారు. సమావేశం అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. 'బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పాం. మా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామన్నారు' అని ఉత్తమ్ తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని ఆయనన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా చూస్తామని కేంద్ర మంత్రి చెప్పారని ఉత్తమ్ అన్నారు. కేంద్ర మంత్రితో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

విశ్లేషణ కోసం అమెరికాకు బ్లాక్‌బాక్స్

(మొదటిపేజీ తరువాయి)

మెరుగైన సమాచారం రాబట్టేందుకు అమెరికాలోని వాషింగ్టన్ డీసీలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అమెరికాకు పంపే సమయంలో ప్రొటోకాల్స్ పాటించడంతో పాటు భారత్‌కు చెందిన అధికారుల బృందం బ్లాక్‌బాక్స్‌తో పాటు వెళుతుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఈనెల 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన వెంటనే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు సహా మొత్తం 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. విమాన ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు బ్లాక్‌బాక్స్‌లోని సమాచారం కీలకం. దీనినుంచి సమాచారం రాబట్టేందుకు నిపుణులు నిమగ్నమయ్యారు.

ఇద్దరం వాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై పోరాటాలు అక్కర్లేదు. ప్రాజెక్టులు కట్టి నీళ్లు తీసుకోండి. ఎవరు వద్దన్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాలు నెంబర్ వన్‌గా ఉండాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

రికార్డులు సృష్టించనున్న యోగాంధ్ర

విశాఖ వేదికగా ఈ నెల 21 తేదీన జరిగే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. రెండు గిన్నీస్ రికార్డులు, మొత్తం 22 ప్రపంచ రికార్డుల సాధన లక్ష్యంగా యోగా డే తలపెట్టామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్న ఈ కార్యక్రమాన్ని ప్రపంచం గుర్తుంచుకునేలా నిర్వహించనున్నట్టు చెప్పారు. 25 వేల మంది గిరిజన విద్యార్థులు 108 నిముషాల పాటు సూర్య నమస్కారాలు చేస్తారని తెలిపారు. ఎక్కువ మంది ఒకేచోట చేయడంతో పాటు ఎక్కువ మంది ఒకేసారి సూర్య నమస్కారాలు చేసి రెండు గిన్నీస్ రికార్డులు సాధించడమే లక్ష్యంగా కార్యక్రమం జరుగుతుందన్నారు. విశాఖలోని రామకృష్ణా బీచ్ నుంచి భోగాపురం వరకూ 26 కిలోమీటర్ల మేర విస్తృత ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆర్కే బీచ్ వేదికగా మొత్తం 3.19 లక్షల మంది ఒకేచోట నుంచి యోగా చేసేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. యోగా డే రోజున విశాఖ సహా రాష్ట్రంలోనూ, దేశంలో, ప్రపంచవ్యాప్తంగా 8 లక్షల ప్రాంతాల్లో ఒకేసారి ప్రజలు పాల్గొంటారని అన్నారు. యోగా కార్యక్రమం ప్రణాళిక ప్రకారం నిర్వహించేందుకు ఒక్కో కంపార్ట్‌మెంట్‌కు వెయ్యి మంది చొప్పున ఉండేలా 326 కంపార్ట్‌మెంట్‌లు సిద్ధం చేశామని, జూన్ 21వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకూ యోగా డే జరుగుతుందని సీఎం వివరించారు.

రౌడీయిజం, హింసను ప్రేరేపిస్తున్న జగన్

రప్పా రప్పా నరకటం అనే పదాన్ని సినిమాల్లో డైలాగులుగా చెబుతున్న జగన్... సినిమాల్లో మనుషుల్ని చంపారని నిజ జీవితంలోనూ చంపేస్తారా అని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్‌కు ఇలాంటి మానసిక స్థితి ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రౌడీయిజం, హింసను ప్రేరేపించేలా జగన్ పరామర్శ యాత్రలు చేస్తున్నారు. పోలీసులు ఇచ్చిన పర్యటన అనుమతులన్నీ జగన్ ఉల్లంఘించారు. ఇరుకుసందుల్లో సమావేశాలు నిర్వహించారు. తొక్కిసలాట జరిగింది. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపారు. కొట్టండి... చంపండి అంటూ ప్లకార్డుల ప్రదర్శనతో ఆనందిస్తున్నారు. దేశంలో ఏ రాజకీయనాయకుడికి, రాజకీయ పార్టీకి ఈ తరహా పోకడలు లేవు. సమాజంలో ఇలాంటి పోకడలు చాలా ప్రమాదకరమన్నారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడుతున్నారు. భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకుడి గురించి ఆలోచించాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలపై చర్యలు తీసుకుంటాంమని స్పష్టం చేశారు.

యుద్ధం తీవ్రతరం

(మొదటిపేజీ తరువాయి)

నియంతలు బీర్‌షేవాలోని సొరోక ఆసుపత్రిపై క్షిపణులతో దాడి చేశారు. దేశ నడిబొడ్డులో పౌరులను లక్ష్యంగా చేసుకున్నారు. తెహ్రాన్‌లోని ఈ నియంతలు ఇందుకు భారీ మూల్యం చెల్లించుకునేలా చేస్తాం' అని ఎక్స్‌లో నెతన్యాహు పేర్కొన్నారు. తెహ్రాన్‌లోని లక్ష్యాలపై వ్యూహాత్మక దాడులను మరింత తీవ్రతరం చేయాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ వెల్లడించారు. ఇజ్రాయిల్‌కు ఇరాన్ నుంచి ఎలాంటి ముప్పు లేకుండా చేయాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఆయాతుల్లా రాజ్యాన్ని పూరిస్థాయిలో అస్థిరపరుస్తామని దీమా వ్యక్తంచేశారు. ఆసుపత్రిపై దాడికి ఇరాన్ అధినేత ఆయాతుల్లా ఖామేనీ ప్రత్యక్ష బాధ్యత వహించాలని కట్జ్ అన్నారు. 'ఇది యుద్ధ నేరం, దీనికి ఖామేనీని వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని ప్రకటించారు. ఇరాన్ హైపర్‌సోనిక్ క్షిపణులు ప్రయోగిస్తున్న తీరు చూస్తే, అది తన కార్యకలాపాలను ఆపబోదని తెలుస్తోందన్నారు. ఇందుకోసమే ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నామని రక్షణ మంత్రి అన్నారు. ఇరాన్‌పై కొత్త వ్యూహంతో దాడి చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇక ఖమేనీ ప్రాణాలతో ఉండేందుకు వీల్లేదని, ఆయనే తమ లక్ష్యమని కట్జ్ స్పష్టంచేశారు.

నేడు జెనీవాలో కీలక భేటీ

తాజా పరిణామాల క్రమంలో యూరప్ ప్రతినిధులతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఆయన శుక్రవారం జెనీవాలో జరగబోయే సమావేశంలో పాల్గొంటారు. ఈ నేపథ్య కొత్త దౌత్యపరమైన చర్యకు తెరతీసే అవకాశాలున్నాయి. యూరోపియన్ యూనియన్ అగ్ర దౌత్యాధికారితో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ విదేశాంగ మంత్రులు ఈ సమావేశానికి హాజరవుతారు. ఈ మేరకు ఇరాన్ అధికారిక ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ తెలిపింది.

దాడులు ఆపండి: చైనా

ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య తక్షణమే కాల్పుల విరమణకు చైనా పిలుపునిచ్చింది. దాడులు ఆపాలంటూ ఇజ్రాయిల్‌ను కోరింది. ప్రాంతీయ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, పోరు ఆగిపోవాలని రెండు దేశాలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జైకున్ తెలిపారు. సైనిక చర్య దిశగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యోచన నేపథ్యంలో బలవంతపు చర్యలు వద్దని చైనా సూచించింది. సైనిక చర్యపై ట్రంప్ స్పష్టత ఇవ్వకపోవడం, అమెరికా జోక్యాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తుండటంతో పోరు మరింత విస్తృతమయ్యే ముప్పు పొంచివుండటంతో స్పందించింది. ఇతర దేశాల సార్వభౌమత్వం, భద్రత, ప్రాదేశిక సమగ్రతకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను సమర్థించబోమని తేల్చిచెప్పింది. అంతర్జాతీయ సంబంధాల్లో ఒత్తిళ్లకు, బెదిరింపులకు తావులేదని, అలాంటి వాటిని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని జైకున్ అన్నారు.

దాడులు చేస్తానో... లేదో: ట్రంప్

ఇరాన్‌పై దాడి చేస్తానో లేదో ఎవరికీ తెలియదంటూ ట్రంప్ తాజాగా ఒక ప్రకటన చేశారు. ఇరాన్ చర్చలకు ముందుకొస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల కిందటే తనను సంప్రదించి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని ఇరాన్‌తో చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. కాల్పుల విరమణకు మించినది తనకు కావాలన్నారు. ఇజ్రాయిల్‌తో కలిసి అమెరికా దాడి చేసే అంశాన్ని తోసిపుచ్చలేదు. అమెరికా రంగంలోకి దిగితే పరిస్థితి మరోలా ఉంటుందని ఇరాన్ ఇప్పటికే తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేసిన విషయం విదితమే. అయితే, ఇరాన్‌పై సైనిక చర్యకు ట్రంప్ వ్యక్తిగత ఉత్తర్వులు జారీచేసినట్లు సంకేతాలు అందుతున్నాయి. ఇదిలావుంటే, అమెరికా ఇప్పటికే ఇజ్రాయిల్‌లోని దౌత్యకార్యాలయాల్లో పనిచేసే తమ సిబ్బందిని, అక్కడుంటున్న తమ పౌరులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

కొత్తింటికి రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

బంగ్లాను ప్రతిపాదించినప్పటికీ... ఆయన ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు గతేడాది పార్లమెంటు వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, రాహుల్ ఎంపీ అయినప్పటి నుంచి ఆయన 12 తుగ్లక్ లేన్‌లో నివసించేవారు. అయితే, పరువు నష్టం కేసులో దోషిగా తేలడంతో 2023లో లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటిం చడంతో ఆయన ఆ ఇంటిని ఖాళీ చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి రాహుల్ తన తల్లి సోనియా గాంధీతో కలిసి 10 జనపథ్‌లోనే నివసిస్తున్నారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నిక కావడంతో ఆయనకు కేబినెట్ మంత్రి హోదా దక్కడంతో టైప్ 8 బంగ్లాకు అర్హులయ్యారు. గతంలో సున్‌హరీ బాగ్ నివాసంలో కర్నాటక బీజేపీ నేత ఎ.నారాయణస్వామి ఉన్నారు. 2021-24 మధ్య కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా ఆయన పనిచేశారు.

అమెరికా కర్రపెత్తనాన్ని అడ్డుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

పరాకాష్ట అన్నారు. వామపక్ష పార్టీల జాతీయ కమిటీల పిలుపులో భాగంగా గురువారం సంఘీభావ దినాన్ని పాటిస్తూ సీపీఐ, సీపీఎం, న్యూ డెమొక్రసీ కార్యాలయాల నుంచి బస్టాండు సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ దేశాలను అమెరికా తన చెప్పుచేతల్లో పెట్టుకొని కర్రపెత్తనం చేస్తోందని ఆరోపించారు. దశాబ్దాలుగా పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ నిరంతర బాంబు, వైమానిక దాడులకు పాల్పడుతోందని, తాజాగా సామాన్య పౌరుల పై మిస్సైళ్లు ప్రయోగించి లక్షలాదిమందిని పొట్టన పెట్టుకుంటుందన్నారు. ఇజ్రాయిల్ మారణహోమాన్ని అంతర్జాతీయ చట్టాలు, మానవహక్కుల సంఘాలు ఏడాది కాలంగా పలస్తీనా పౌరులను కాపాడలేకపోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. పలస్తీనా ప్రజలకు యావత్ ప్రపంచం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా ప్రోత్సహంతో ఇజ్రాయిల్ జరుపుతున్న బీభత్సాన్ని నిలిపివేయాలని భారతీయ మానవ శాంతి కాముకులు రోడ్లెక్కి ఇతర దేశాలకు స్ఫూర్తినివ్వాలని కూనంనేని పిలుపునిచ్చారు. అమెరికా ముందు మోకరిల్లే విధానాలకు ఇరాన్ స్వస్తిచెప్పడం అభినందనీయమన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ యుద్ధంపై, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ నోరువిప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, న్యూ డిమొక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం, కె. సురేందర్ అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఖండించారు. సీపీఐ నేతలు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, నేరెళ్ల రమేష్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణాచారి, యూసుఫ్, షాహీన్, సీపీఎం జిల్లా నాయకులు ఏజే రమేష్, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, ఎస్.లక్ష్మి, న్యూ డిమొక్రసీ గౌని నాగేశ్వర్ రావు, కల్తీ వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, ప్రణయ్, మాస్ లైన్ నాయకులు జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం, అమర్లపూడి రాము పాల్గొన్నారు.

డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, దామరచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపి రిజిస్టర్, ఇతర రిజిస్టర్‌ను, మందుల స్టాక్‌ను పరిశీలించారు. డాక్టర్లతో మాట్లాడుతూ సమయం ప్రకారం డాక్టర్లు, సిబ్బంది విధులకు హాజరు కావాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందించాలని, కేసులు సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే నల్గొండ ప్రభుత్వాసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రెఫెర్ చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ కేంద్రంలో ఉన్న పిల్లలను పరిశీలించారు. అంతేకాక నిర్మాణంలో ఉన్న టాయిలెట్ పనులను తనిఖీ చేశారు. ఆక్టివిటీ రూమ్‌లో నూతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించడం జరుగుతుందని, అలాగే ఫిజియోథెరపీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కస్తుర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కె జి బి వి పరిసరాలు, టాయిలెట్స్ అన్నింటిని తిరిగి పారిశుద్యాన్ని పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - తొర్రూరు: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి కామ్రేడ్ బంధు మహేందర్‌లు అన్నారు. గురువారం తొర్రూర్ పట్టణ మహాసభ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కార్యదర్శికి మినిట్ బుక్‌ను వారు అందజేశారు. నూతన కమిటీని ప్రకటించగా అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ శ్రేణులను గెలిపించి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. ఈనెల 22న జరగనున్న మండలం మహాసభను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీని తొర్రూరు పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, సహాయ కార్యదర్శులుగా పసుల యాకయ్యను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎం చంద్రయ్య సైరెడ్డి, నరసింహారెడ్డి, బిక్షపతి, వెంకన్న, దేవేందర్, కుమారు, కృష్ణ, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధించే వరకు పోరాడుతాం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారంలో ఉక్కు పరిశ్రమ సాధించేవరకు పోరాడుతామని వామపక్ష నాయకులు, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్‌లు అన్నారు. నాడు బిఆర్ఎస్, బిజెపి వైఫల్యంతో బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం చేసిన ఉద్యమ పోరాటంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే మురళి నాయక్, వామపక్ష నేతలు బి విజయసారథి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్యలతో తదితరులు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి, టిఆర్ఎస్ లో విభజన హామీ బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపించకపోగా, ఈ ప్రాంత ప్రజల పక్షాన ఉపాధి కోసం బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, ఆందోళన చేస్తే, పరిశ్రమ స్థాపించకుండా అక్రమంగా కేసులు పెట్టి నిర్బంధాలకు గురి చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటయిందని, ఈ సందర్భంగా ఆ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వారన్నారు. ఎమ్మెల్యేగా బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కోర్టుకు హాజరైన వారిలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, ఆకుల రాజు, దసురు నాయక్, పెరుగు కుమార్, శంతన్, రామరాజు, జిన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, గుణగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, మాధవి, బానోత్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, పోతరాజు వీరన్న, సిరిపురం వీరన్న, హేమా నాయక్, గుంజే హనుమంతు, మధు, శీను, తదితరులు ఉన్నారు.

కార్మికులు హక్కుల సాధన కోసం పోరాడాలి

విశాలాంధ్ర - తొర్రూర్: రెక్కలు ముక్కలు చేసుకుని చెమటలు చిందించి కష్టపడుతున్న కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం పోరాడాలని టీయూసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవిఅన్నారు. జూన్ 21, 22 తేదీలలో నిజామాబాద్‌లో జరుగు టీయుసిఐ రాష్ట్ర ప్రథమ మహాసభల ప్రచారాన్ని గురువారం తోరూర్‌లో విస్తృతంగా చేశారు. అన్నారం రోడ్డులో గల భవన నిర్మాణ కార్మికుల అడ్డా మీద కార్మికుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సంఘటిత అసంఘటిత రంగాలలో కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారని అన్నారు. సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలు కార్మికుల శ్రమ శక్తిని మరింత దోచుకోవడానికి పని గంటల పెంపు కోసం చట్టాలు చేయటం అన్యాయమని అన్నారు. నేడు అమలవుతున్న ఎనిమిది గంటల పని కోసం కార్మిక వర్గం రక్తం చిందించి ప్రాణాలర్పించి ఎన్నో సమస్యల పోరాటాలు నిర్వహించాలని గుర్తు చేశారు. కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల మెడలపై వేలాడుతున్న కత్తిలా మారిందని అన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా టి యు సి ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు అమ్రేష్ పటేల్, ఉపాధ్యక్షులు అలిక్ చక్రబర్తి హాజరుకానున్నారని తెలిపారు. ఏరియా కమిటీ అధ్యక్షులు శ్రీరాం పుల్లయ్య, వడ్లకొండ లక్ష్మయ్య, యాకయ్య, గుంశావళి, మధు, రమేష్, బాలు, మహేందర్, వెంకన్న మురళి పాల్గొన్నారు.

నూతన పరిజ్ఞానంతో విద్యార్థులకు విద్యాబోధన

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : జిల్లాలో నూతన పరిజ్ఞానంతో విద్యా బోధన అందించడం జరుగుతుందని, విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటూనే చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లిలోని పిఎం శ్రీ మోడల్ స్కూల్‌లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలసి పాఠశాలలో కొత్తగా కంప్యూటర్ ల్యాబ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం పలు కంపెనీల సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా విద్యా బోధన చేయడానికి అవకాశాలను మెరుగు పరచడం జరిగిందన్నారు. అనంతరం ములుగు నుండి పొట్లాపూర్ కి.మి. 2/0 నుండి 13/03 వరకు అంచనా విలువ రూ 1900 లక్షలతో రహదారి వెడల్పు, పటిష్ట పరుచు పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌లతో కలసి శంకుస్థాపన చేశారు.

ములుగుజిల్లాలోని జగ్గన్నపేట గిరిజన కళాశాలలో కుట్టు మిషన్ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్, ధ్రువపత్రాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలసి పంపిణీ చేశారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చాలా మంది నైపుణ్యం లేని కారణంగా ఉపాధికి దూరంగా ఉంటున్నారని, దూర ప్రాంతాలకు పనికోసం వెళ్ళి మళ్ళీ ఇంటికి వెనుతిరిగి వస్తున్నారని, ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకొని మహిళలు ఉన్నదగ్గరనే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో వారికి ఈ కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కొరకు కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్లో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో శిక్షణ పొందిన 100 మంది నిరుద్యోగులలో పలు కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన 51 మంది యువతకు నియామక పత్రాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవిచందర్ సమక్షంలో అందజేశారు.

ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న పాఠశాలపై చర్యలేవి...

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి. ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని పరిగణంలోకి తీసుకోకుండా ఒక లక్ష పదివేల నుండి రెండు లక్షల వరకు మళ్లీ ఫీజులు అదనంగా తీసుకోవడమే కాకుండా, ఇతర ఫీజుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ దందాను చేస్తున్న హార్వెస్ట్ పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అధికారులు ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని అయన ఆరోపించారు. హార్వెస్ట్ పాఠశాలలో అడ్మిషన్ పొందాలంటే టాలెంట్ టెస్ట్ నిర్వహించి వాళ్ల టాలెంట్ టెస్ట్ ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వడం విద్యాశాఖ నిబంధన నియమావళికి విరుద్ధమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే కాకుండా స్టేషనరీ పేరుతో తమ పాఠశాల పేరుతో ముద్రించినటువంటి స్టేషనరీ, బుక్స్, యూనిఫామ్, నోట్ బుక్స్, షూస్, టై బెల్టు కోసం ఒక పెద్ద స్టోర్ ఏర్పాటు చేసుకొని తమ పాఠశాల విద్యార్థి ప్రతి ఒక్కళ్ళు పాఠశాల యజమాన్యం నిర్ణయించిన ధరకే కొనుగోలు, చేయక తప్పని పరిస్థితులు కల్పించారన్నారు. బయట కొనుగోలు చేస్తే అనుమతి ఇచ్చేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇట్టి విషయంపై ఫిర్యాదు చేయగా ఖమ్మం అర్బన్ ఎంఈఓ వారు స్టోర్‌లో తనిఖీలు నిర్వహించి ఆ స్టోర్‌ని సీజ్ చేయడం జరిగింది అన్నారు. అదేవిధంగా పాఠశాలలో జరుగుతున్న ఫీజులు దోపిడీ పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేస్తున్నాం. లేనియెడల విద్యాశాఖ అధికారుల కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, మనోజ్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: విద్యుత్ సరఫరా మెరుగు పరచడానికి, రూ. రెండు కోట్ల 40 లక్షల వ్యయంతో గోదావరి ఖనిలో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్లను గురువారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాటిమాటికి కరెంటు కోత ఉండేదని, కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ కూడా కరెంటు కోతలు లేకపోవడం చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ సబ్‌స్టేషన్లలో 8 మెగావాట్ల సామర్థ్యం గల రెండు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా ప్రాంతీయ ప్రజలకు నిరవధికంగా, ఒత్తిడిలేని విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నిత్యం యోగ శారీరక వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు మెట్టు వేణుగోపాల్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేరేడుచర్ల శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాంగణంలో పుర ప్రజలకు యోగ శారీరక వ్యాయామంపై గురువారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఒక గంట సమయం యోగా ధ్యానం కోసం కేటాయించి సంపూర్ణ ఆరోగ్యం కోసం సాధన చేయాలన్నారు. యోగ ఆసనాలపై సూచనలు అందిస్తూ శిక్షణ అందించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ సరస్వతి విద్యా మందిర్ ఆవరణంలో ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు సామూహిక యోగ ధ్యానం శారీరక వ్యాయామం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆసక్తిగల పుర ప్రముఖులు హాజరు కావలసిందిగా కోరారు.

ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిత్యం జీవితంలో హుషారుగా జీవించాలని వైరా నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు లావుడియా రాములు నాయక్ పిలుపునిచ్చారు. గురువారం సింగరేణి మండల పరిధిలోని గేటురేలకాయలపల్లి మాజీ సర్పంచ్ బానోతు సక్రాం సతీమణి బానోత్ సరోజ ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. సరోజ సంస్మరణ సభ రేలకాయలపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ హాజరై సరోజ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి భర్త సంక్రాంతో పాటు ఆమె కుమారులు కూతుర్లను పరామర్శించి ఓదార్చి ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ జెడ్పిటిసిలు వాంకుడోత్ జగన్, వున్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సొసైటీ ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, బానోత్ హీరోలాల్, నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, అజ్మీర వీరన్న,బానోతు రామ్మూర్తి రామ్మూర్తి,మేదరి టోనీ,అడప పుల్లారావు, కడియాల రాజు, ధరావత్ పాండ్యా నాయక్, బానోత్ శంకర్, వికాస్, గణిత సత్యనారాయణ, ముత్యాలరావు,సైదులు, ధారావత్ బద్రునాయక్, గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు భూక్య రమణ, బానోతు మారు సక్రు, భూక్య రంగారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - గూడూర్: గ్రామ పంచాయతీ కార్మికుడు కొమ్ముల వెంకన్న అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ నాగ భవాని, మండల ప్రజా పరిషత్ అధికారి ఎర్ర వీరస్వామి, ఎంపీ ఓ సత్యనారాయణ కార్యదర్శులు అశోక్‌లు ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. మృతుడు వెంకన్న పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబానికి కార్యదర్శి అశోక్‌ల చేతుల మీదుగా 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మండల తాహసిల్దార్ నాగభవాని మాట్లాడుతూ కొమ్ముల వెంకన్న లేని లోటు తీర్చలేమని ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. మృతుని కుటుంబానికి అండదండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష టి.జి.డబ్ల్యు.ఐ.డి.సి, టి.జి.ఎం.ఎస్.ఐ.డి.సి ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ టి.జి.డబ్ల్యు.ఐ.డి.సి. ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జడ్పిహెచ్ఎస్ రామగుండం పాఠశాలకు 40 లక్షలు సిఎస్ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. పాఠశాల అభివృద్ధి పనులకు వెంటనే ఎస్.ఎం.సి (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) తీర్మానాలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నందున సంబంధిత పనులు వారం రోజులలో ప్రారంభం కావాలని అన్నారు. టి.జి.ఎం.ఎస్.ఐ.డి.సి చేపట్టిన పెద్దపల్లి ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మరమ్మతు పనుల పురోగతి వివరాలను తెలుసుకున్న కలెక్టర్ వాటిని సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పెద్దపల్లి ఆసుపత్రిని సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల గుడుంబా స్వాధీనం : ఎస్ఐ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం బస్టాండ్‌లో పోలీసుల సమాచారం మేరకు ఏటూరు నాగారం ఎస్సై రాజకుమార్ తన సిబ్బందితో, సహాయంత్రం తనిఖీలు చేయగా, గోవిందరావు పేట మండలంలోని రాంనగర్ తండాకు చెందిన అజ్మీర మౌనిక దగ్గర 20 లీటర్ల గుడుంబాను పట్టుకోవడం జరిగిందని, ఎస్ఐ రాజు కుమార్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కానిస్టేబులు గోపి, హరీష్‌లు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రభుత్వ, ప్రైవేటు విద్య సంస్థలు తమ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని న్యూ గొల్లగూడెం కిడ్స్ పార్క్ పాఠశాలలో గురువారం ఎనిమిదో తరగతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు విద్య సంస్థలు వ్యాపార దృక్పధంతో కాకుండా సామాజిక సేవా దృక్పధంతో కూడా తమ విద్యా సంస్థలను కొనసాగించినపుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని సూచించారు. పట్టణంలోని కిడ్స్ పార్క్ పాఠశాల మెరుగైన విద్యను అందించి విద్యార్థుల భావి జీవితానికి బాటలు వేయాలన్నారు. ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణంలో కిడ్స్ పార్క్ పాఠశాల స్థాపించి పేద విద్యార్థులకు విద్యను అందించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వైజ్ఞానిక ప్రదర్శనలను కూనంనేని ఆసక్తిగా తిలకించి చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, నాయకులు మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, ఎండి. యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, దుర్గ, నేరెళ్ల రమేష్, ముత్యాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు, సిబ్బంది సేవలు భేష్... : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల డాక్టర్లు, సిబ్బంది అద్భుతంగా సేవలను అందిస్తున్నారని రాష్ట్ర టీవీవీపీ కమిషనర్ డా. అజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అభినందించారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అంకిత భావం తో పని చేసి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వారి సేవలను కొనియాడారు. గురువారం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన అజయ్ కుమార్ ఆసుపాత్రులలో అన్ని వార్డులను, ఓపి రూమ్స్, దయాలసిస్ వార్డ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసి స్టోర్‌లను చూసారు. రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. యాభై పడకల ఆసుపత్రి అయినప్పటికీ వంద పడకల ఆసుపత్రి స్థాయిలో సేవలందిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో కలెక్టర్‌తో కలిసి పాల్వంచ పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్లో భద్రాచలం, చర్ల, అశ్వారావుపేట, బుర్గంపాడు, మణుగూరు, ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది అని ఆ వృత్తిలో వైద్య సిబ్బందికు మాత్రమే ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డా. రవి బాబు, జిల్లాలోని సూపరింటెండెంట్‌లు, నర్సింగ్, పారామెడికల్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ఇండెక్స్ అవగాహన అవసరం : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పంచాయతీ అభివృద్ధి సూచిక పి ఎ ఐ 2.0లో పేర్కొన్న అంశాలపై గురువారం ఐ డి ఓ సి కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పంచాయతీ అడ్వాన్మెంట్ ఇండెక్స్ అనేది కేవలం ఒక ర్యాంకింగ్ సూచిక కాదని, గ్రామీణ అభివృద్ధిని మలుపుతిప్పే ఒక ప్రణాళికాత్మకమార్గదర్శక పద్ధతి అన్నారు. ఈ సూచిక ద్వారా గ్రామ పంచాయతీల ప్రదర్శనను వివిధ పారామీటర్లలో అంచనా వేయవచ్చన్నారు. విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్యం, పర్యావరణం, డిజిటల్ లావాదేవీలు, మహిళా భాగస్వామ్యం వంటి విభిన్న అంశాల్లో పంచాయతీల స్థితిగతులు అర్థమవుతా యని కలెక్టర్ అన్నారు. అనంతరం కలెక్టర్ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, విద్య శాఖ అధికారి వెంకటేశ్వరచారి, జిల్లాలోని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా తిరుపతి రెడ్డి, రవి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ 2025 - 2028 కాలం వరకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.తిరుపతి రెడ్డి, కంభంపాటి రవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం వారికీ ఎన్నికైన ధ్రువపత్రాలు అందించారు. కాగా ఎన్నికల నిర్వహించే ప్రక్రియలో భాగంగా బుధవారం వరకు జిల్లా నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఈ నామినేషన్లలో అధ్యక్షునిగా తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంభంపాటి రవిలతో పాటు కోశాధికారిగా ఏ లక్ష్మణాచారి నామినేషన్ వేయడం జరిగింది. ఒక్కో పదవికి ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. దింతో వీరు జిల్లా 2025- 2028 కాల పరిమితికి అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారి పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ అసోసియేషన్‌లో తొలి నుండి జిల్లా వ్యాప్తంగా తిరుపతిరెడ్డి, రవిలు ఎంతో సంయమనం పాటిస్తూ ప్రతి సమస్యని దగ్గరుండి ఎంతో చొరవ తీసుకునేవారు. ఈ కారణం వల్ల జిల్లాలోని సభ్యులు వీరిపై పోటీకి దిగ కుండా నమ్మకంతో ఏకగ్రీవ ఎన్నిక జరిగేందుకు సహకరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు టి.తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంభంపాటి రవి, కోశాధికారి, లక్ష్మణాచారికి శుభాకాంక్షలు తెలుపుతూ నియామక పత్రాలను టీటీసీడిఎ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారావు, పరిశీలకులు మృత్యుంజయరెడ్డిలు అందజేసారు. ఎన్నికల అధికారులుగా రాజేంద్రప్రసాద్, అగర్వాల్ కోట శ్రీనివాసరావులు వ్యవహారించారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణం లోని పురపాలక సంఘ ఆవరణలో పట్టణానికి చెందిన 12 వార్డులలో గల 86 మంది లబ్దిదారులకు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మీదుగా ఇద్దిరమ్మ ఇండ్ల మంజూరి ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధోనికే నా దయానంద్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం మాజీ నీటిపారుదల శాఖ చైర్మన్ మదిరే సత్యనారాయణ మాజీ వై ఎఫ్ ఎంపీ పీ తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

12 మంది మావోయిస్టుల లొంగుబాటు : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మావోయిస్టు పార్టీకి చెందిన 12 మంది దళ సభ్యులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లొంగి పోయారు. ఈ మేరకు గురువారం మీడియా సమావేశంలో మావోయిస్టులను ప్రదర్శించి ఎస్పీ మాట్లాడారు. ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూత కార్యక్రమం ఫలితాలు అందిస్తుందన్నారు. దీని ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయాలను గురించి తెలుసుకుని చాలా మంది నక్సలిజాన్ని విడనాడి తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 12 మంది మావోయిస్టు లొంగిపోయారన్నారు. ఇందులో ముగ్గురు మహిళా సభ్యులున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి-2025 నుండి ఇప్పటివరకు వీరితో కలిపి 294 మావోయిస్టు లొంగిపోయినట్లు చెప్పారు. ప్రస్తుతం సాయుధ దళాల సంచారం తెలంగాణ- చత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో ఉన్నదన్నారు. లొంగిపోయిన 12 మంది మావోయిస్టులకు తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి రూ.25 వేలు చొప్పున మొత్తం నగదు రూ. 3,00,000 ఇవ్వడం జరుగుతుందన్నారు.

సంపాదకీయం

ట్రంప్ ధూర్తత్వం-మోదీ దాసోహం

మే ఆరు-ఏడు తేదీల అర్ధరాత్రి నుంచి మొదలై పదవ తేదీన ముగిసిన ఆపరేషన్ సిందూర్‌ను నిలిపి వేయించింది ఎవరు అనే ప్రశ్నకు ఇంతవరకు స్పష్టమైన సమాధానం రానే లేదు. ట్రంప్ మాత్రం భారత్-పాకిస్థాన్ మధ్య "యుద్ధం" ఆపించింది తానేనని ఇప్పటికి 15 సార్లు చెప్పారు. కెనడాలో జరిగిన జి-7 దేశాల సమావేశానికి ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందడమే గగనమైంది. మొత్తం మీద ఆఖరి దశలో ఆహ్వానం అందింది. మోదీ హాజరయ్యారు. భారత్ లాంటి దేశాలు జి-7 బృందంలో లేవు. కానీ ఆ బృందంలో లేని కొన్ని దేశాల అధిపతులను కూడా ఆహ్వానించడం ఆనవాయితీ. ఇలా ఆహ్వానాలు అందిన దేశాల అధిపతులకు ప్రధానమైన చర్చల్లో పాల్గొనే అవకాశం ఉండదు. కానీ ఇలాంటి దేశాల అధిపతులు అక్కడికి వచ్చిన వివిధ దేశాల అధిపతులతో చర్చలు జరిపే అవకాశం ఉంటుంది. మోదీ చేసింది అదే. అదే సమావేశంలో భారత ప్రధానమంత్రి మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య కూడా చర్చలు జరుగుతాయనుకున్నారు. కానీ ట్రంప్ హడావుడిగా స్వదేశం వెళ్లిపోయారు. అది పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్‌కు విందు ఇవ్వడానికి కావొచ్చు. లేదా ఇరాన్ మీద ఇజ్రాయిల్ చేస్తున్న దాడి నేపథ్యంలో రణతంత్రాల గురించి చర్చించడానికీ కావొచ్చు. అమెరికా అధ్యక్ష స్థానంలో ఉన్నవారు కేవలం విందులతోనే కాలక్షేపం చేయరు. వారు చేయాల్సిన పనులు అనేకం ఉంటాయి. కెనడాలో ట్రంప్‌తో చర్చించే అవకాశం రాలేదు కనక మోదీ ట్రంప్‌తో ఫోన్లో 35 నిముషాల పాటు సంప్రదించారట. విందు సందర్భంగా పాక్ సేనాధిపతి అసీం మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఏయే అంశాలు చర్చకు వచ్చాయో బయటకు రాలేదు. అది మునీర్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందు కనక మీడియా ప్రతినిధులతో తప్ప ఇతరులెవరికీ ప్రవేశం లేదు. కానీ మోదీ 35 నిముషాలపాటు ట్రంప్‌తో ఫోన్లో జరిపిన సంభాషణ గురించిన పూర్తి వివరాలూ బయటకు రాలేదు. కానీ భారత విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ 4 నిముషాల 40 సెకన్ల వీడియో విడుదల చేశారు. దాని ప్రకారం ఆపరేషన్ సిందూర్‌ను ఆపించింది మీరు కాదు అని మోదీ స్పష్టంగా చెప్పిన దాఖలాలైతే లేవు. కానీ పాకిస్థాన్ అభ్యర్థన మేరకు మాత్రమే కాల్పుల విరమణకు అంగీకరించామని మోదీ ట్రంప్‌తో అన్నారు. విచిత్రం ఏమిటంటే మోదీతో సుదీర్ఘంగా ఫోన్‌తోమాట్లాడిన తరవాత కూడా ట్రంప్ భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఘర్షణ ఆపించింది తానే అంటున్నారు. ఆయన ఈ మాట చెప్పడం పదిహేనోసారి. ట్రంప్ తో మోదీ సంభాషణలో పాకిస్థాన్‌తో తగవు విషయంలో తాము మూడో వ్యక్తి లేదా దేశాధిపతి మధ్యవర్తిత్వానికి అవకాశం ఇవ్వలేదని స్పష్టంగా చెప్పారు. ఎందుకంటే పాక్‌తో వైరం కేవలం ద్వైపాక్షికమైందని 1971లో సిమ్లా ఒప్పందం కుదిరినప్పటి నుంచి భారత్ చెప్తోంది. "యుద్ధం" ఆపించింది తానేనని ట్రంప్ పదే పదే చెప్తున్న మాటలను భారత్ నిరాకరిస్తూ ఉండవచ్చు. కానీ ట్రంప్ తో ఫోన్లో సంభాషించినప్పుడు కూడా మోదీ ట్రంప్ వాదనను నేరుగా ఖండించలేదు. ఆపరేషన్ సిందూర్ మొదలైన తరవాత ఇతరులెవరితోనూ ఈ విషయంలో చర్చించలేదని మోదీ అంటున్నారు. అంటే ట్రంప్‌తో కూడా చర్చించలేదనుకోవాలి. ఈ విషయం చర్చకు వచ్చిందల్లా మోదీ-ట్రంప్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలోనే. అందులోనూ మోదీ నేరుగా ట్రంప్ వాదనను ఖండించలేదు. అన్యాపదేశంగా మాత్రమే యుద్ధం ఆపించింది తానేనని ట్రంప్ చెప్పుకోవడాన్ని నివారించే ప్రయత్నం చేశారు. ఫోన్ సంభాషణ తరవాత కూడా ట్రంప్ పదిహేనవ సారి "యుద్ధం" ఆపించింది తానేనని, రెండు దేశాలతోనూ వాణిజ్య సంబంధాల గురించి ఒత్తిడి చేసి "యుద్ధం" ఆపించానని అంటున్నారంటే అది కేవలం ధూర్తత్వమే అయి ఉండాలి. ట్రంప్-మోదీ ఫోన్ సంభాషణ గురించి అమెరికా నుంచి అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.

పాక్ సైన్యాధిపతి మునీర్‌కు విందు ఇవ్వడానికి ముందు కూడా మీడియా ప్రతినిధులు ట్రంప్‌ను ఈ విషయం గురించి అడిగారు. "అవును యుద్ధం ఆపించింది నేనే. నాకు పాకిస్థాన్ అంటే ఇష్టం. మోదీ అద్భుతమైన నాయకుడు అని ట్రంప్ బదులిచ్చారు. నేను రాత్రి మోదీతో ఫోన్‌లో మాట్లాడాను అని కూడా చెప్పారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నాం. కానీ భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆపించింది మాత్రం నేనే" అని ట్రంప్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం గురించి ఏ దశలోనూ, ఎవరితోనూ చర్చించలేదని మాత్రం మోదీ ట్రంప్‌కు గట్టిగానే చెప్పారు. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య వివాదంలోనూ మూడో పక్షం మధ్యవర్తిత్వం ప్రసక్తే లేదు అని కూడా మోదీ చెప్పారట. భారత్-పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతలు సడలడానికి మునీర్, మోదీ కృషి చాలా ఉందని ట్రంప్ అనడం ఒక రకంగా ఒక దేశ సైన్యాధిపతిని, ప్రధానిని ఒకే గాట కట్టి భారత్‌ను అవమానించడమే. ఈ మధ్యలో భారత్-పాక్ దేశాలను సమానంగా చూసే వైఖరి ఎక్కువైంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి తన మద్దతు ఉంటుందని ట్రంప్ అంటున్నారు. అలాంటప్పుడు పాకిస్థాన్ సైన్యాధినేతను ఎలా సమర్థిస్తున్నారు? ఆయనకు విందు ఎందుకు చేస్తున్నారు. పాకిస్థాన్ అధినేతకు ట్రంప్ విందు ఇవ్వడాన్ని అర్థం చేసుకోవచ్చు. పాక్ ప్రేరేపిత తీవ్రవాద ఆగడాలకు అసలు బాధ్యుడు మునీరే కదా! మే ఆరు-ఏడు తేదీల మధ్య అర్ధరాత్రి భారత్ పాకిస్థాన్ మీద చేసిన విమాన దాడులు "చాలా పరిమితమైనవి, కచ్చితమైనవని, ఉద్రిక్తతలను పెంచడానికి ఉద్దేశించినవి కావు" అని ట్రంప్‌కు సంజాయిషీ ఇచ్చుకోవలసిన అగత్యం మోదీకి ఎందుకు వచ్చింది. ఇది అమెరికాకు దాసోహం అనడమే కదా! పాకిస్థాన్ తూటా ప్రయోగిస్తే తాము ఫిరంగులతో సమాధానం చెప్తామన్న మోదీ పాకిస్థాన్ ప్రాధేయపడినందువల్ల కాల్పుల విరమణకు అంగీకరించడం ఏమిటి? ఆపరేషన్ సిందూర్ ఇంకా ఆగలేదని పదే పదే చెప్పడం కాల్పుల విరమణకు అంగీకరించడం మధ్యలో ఫిరంగి గుండు ఎక్కడ మాయమైనట్టో! మే 9వ తేదీన అంటే కాల్పుల విరమణకు అంగీకరించే రోజుకు ముందు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ తనతో మాట్లాడుతూ పాకిస్థాన్ భీకరమైన దాడికి దిగబోతోందని చెప్పారట. కాల్పుల విరమణకు ఈ హెచ్చరిక కూడా తోడ్పడిందనుకోవాలా? అలాంటప్పుడు "యుద్ధం" ఆపడంలో ట్రంప్ ప్రమేయం లేదని ఎలా అనగలం! పాకిస్థాన్ మీద అత్యంత అభిమానం ఒలకబోస్తూ, తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ కొనసాగించే పోరాటాన్ని సమర్థిస్తామని ట్రంప్ చెప్పడాన్ని వర్ణించడానికి ధూర్తత్వం కన్నా తక్కువ మాట ఏమైనా ఉంటుందా!

వ్యవస్థ మార్పు కోసం

ప్రస్తుత సమాజంలో వ్యవస్థ మారాలంటే సైనిక పాలన తప్పదు. అంతే నేనిక ప్రజాస్వామ్యాన్ని నమ్మి కూర్చోలేను. ఇంతకాలం వేచి చూశాను. మార్పు లేదు. పార్టీల మార్పు తప్ప వ్యవస్థలో మార్పు ఏ మాత్రం కనపడదు. ఇక నా ఓర్పు, సహనం నశించిపోయాయి. నక్సలైట్లలో కలవాలనే కోరిక బలపడుతోంది. ఏంటి బావ పొద్దునే నక్సలైట్లు అంటున్నావు. అవునయ్యా ఇక్కడ జీవచ్ఛవంలా బతికే కంటే సమాజ మార్పుకోసం నక్సలైటుగా చనిపోవడమే మంచిది కదా. భలేవాడివయ్యా ఈ మధ్య నక్సలైట్లను చంపి శవాలను కూడా బంధువులకు ఇవ్వలేదు. దేశ ప్రజల కోసం ప్రాణాలర్పించిన నక్సలైట్ల శవాలను అనాథ శవాలుగా మార్చింది ఈ మోదీ ప్రభుత్వం. ఈ పరిస్థితిలో నక్సలైటుగా మారి సాధించేదేమీ ఉండకపోవచ్చు. కమ్యూనిస్టు పార్టీ నుంచి విడిపోయే సమయంలోనే అడవుల పాలయి సాధించేదేమీ ఉండదని మారుతున్న కాలంలో టెక్నాలజీ పెరిగి చెట్టు తొర్రల్లో దాక్కున్నా కనిపెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చి వేస్తారని ఆనాటి కమ్యూనిస్టు నాయకులు చెప్పినా చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి పెడచెవిన పెట్టారు. బ్యాలెట్ బాక్సుల ద్వారా ఓట్లు వేసి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని పడగొట్టలేమని ప్రపంచంలో ఎక్కడా ఓట్ల ద్వారా ప్రభుత్వాలు మారలేదని యుద్ధం అనివార్యమని వారు ప్రాణాలర్పించారు. నిజమేనయ్యా అది 1967లో జరిగిన సంఘటన అయినా ఇప్పటికి ఏ విధంగాను మార్పు రాలేదు. నిజమే ప్రస్తుతం తామంతా ప్రజల కోసమే కష్టపడుతున్నామని ప్రతిపక్షం అవసరం లేదని పాలక పక్షాలు అంటున్నాయి. ప్రతిపక్షం అంటే అభివృద్ధి నిరోధకులని భావన ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనదని చెప్పుకుంటూ ప్రతిపక్షం అవసరం లేదని అంటున్నారంటే ఇక మనకు స్వేచ్ఛ అనేది ఎక్కడుందో తెలియదు. రానురాను ప్రజాస్వామ్యం పేరిట రాచరిక పాలన సాగుతోందనడంలో అతిశయోక్తి లేదు. సామాన్య పౌరుల సంగతి పక్కన పెట్టినా ప్రజలెన్ను కున్న శాసనసభ్యునికిగాని, శాసనసభ్యులెన్నుకున్న మంత్రులకు గాని శాసనాలు అమలుపరిచే ఐఏఎస్, ఐపీయస్‌లకు కూడా స్వేచ్ఛ లేకుండా పోయింది.

ఇదంతా నిజమే అట్లని సైనిక పాలన ఎలా కోరుకుంటాం. ఒక ప్రజాస్వామ్యవాదిగా అలా కోరుకోం కదా. ప్రజల్ని ప్రజలే పాలించు కోవాలని మనం ఎన్నుకుంటే పైనుంచి కింది స్థాయి వరకు సంపాదనకు అలవాటుపడి వారి కర్తవ్యం మరిచిపోయి ఎన్నుకున్న ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షంలోని లోహియా, కృపలాని, సుందరయ్య, హిరేన్‌ముఖర్జీ లాంటి వారి సూచనలకు విలువిచ్చి స్వీకరించేవారు. ఇందిరాగాంధీ నుంచి దాదాపు నియంతపాలన మొదలుకాగా అది అన్ని రాష్ట్రాలు ఏలేవారికి వరంగా మారింది. అంతటితో ఆగక అంతా మేమే చూస్తాం ప్రతిపక్షం ఎందుకని ప్రశ్నిస్తున్నారంటే మనం ఇంకా ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా అనే సందేహం కలుగక మానదు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన ప్రణబ్‌ముఖర్జీ, ఉపరాష్ట్రపతిగా పదవీవిరమణ చేసిన అన్సారీ కూడా ఉభయసభల్లో చర్చ అవసరమని అన్నారు. కాని వారి మాటలు వినిపించుకునేవారు ప్రస్తుతం పాలకుల్లో కనబడటం లేదు.

నిజమేనయ్యా రోజులు గడుస్తున్న కొద్దీ నేను నా సమాజం అనే ఆలోచనమాని నేను నా కుటుంబం అని ఆలోచించి స్వార్థ చింతనతో సంపాదన కోసం ఆలోచిస్తున్నారు. ప్రజలిచ్చిన పదవి అడ్డం పెట్టుకుని వ్యాపారాలు పెంచుకోవడంతో పాటు ప్రజల ఆస్తిని కొల్లగొడుతున్నారు. ఎవరికి వారు ఒకరిని మించి మరొకరు తదుపరి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంపాదించడంలో పోటీ పడుతున్నారే తప్ప ఎన్నుకున్న ప్రజల సమస్యలు గాలి కొదిలేస్తున్నారు. ఎన్నికల్లో ఒకరిని మించి మరొకరు ఓట్లు కొనుగోలు చేయడంలో పోటీ పడుతున్నారు. ఈ పరిస్థితి చూసి మేధావులు మౌనం వహిస్తే నిరుపేదలు మా గతి ఇక ఇంతేనా అని వేడి నిట్టూర్పు విడుస్తున్నారు. ఈ సమయంలో కొందరు విరక్తితో ప్రజలను ఆదుకోవాలని దోపిడీదారుల్ని అంతమొందించాలని నక్సలైట్లుగా మారుతున్నమాట నిజమే. కాని వారి ఆశయం నెరవేరక ముందే ప్రాణాలు కోల్పోతున్నారు.

కమ్యూనిస్టులు 1940-60 మధ్యలో ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలు తీర్చడంలో ముందు నిలబడ్డారు. దాంతో ప్రజలకు వారు దేవుళ్లుగా కనిపించారు. ప్రతి గ్రామంలో సెంటరులో చెట్టుపైన, ఇంటిపైనా ఎర్రజెండా ఎగరేశారు. దాంతో 1952 లో జరిగిన మొదటి ఎన్నికలలో ఊహించని ఫలితాలొచ్చి 1955 ఎన్నికలలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకోగా ఫలితాలు తారుమారైనాయి. అనుకోని విధంగా 1964లో పార్టీ చీలిపోయింది. 1967లో మరల చీలిపోయి నక్సలైటుగా మారిపోయారు. అప్పటి నుంచి కమ్యూనిస్టులు బలహీన పడటంతో కాంగ్రెసు విజృంభించి ప్రజల ఆస్తులు కొల్లగొడితే ప్రస్తుతం స్థానిక పార్టీలు ఆ పనిలో మునిగిపోయాయి. ఇక ప్రజలగోడు వినేవారెవరు అని సామాన్యులు మధనపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజల తరఫున పనిచేయాలంటే గతంలో వలే కమ్యూనిస్టులు, ప్రజాహితులు ప్రజాసేవ గ్రామాల్లో మొదలు పెట్టి గతంలో వలే ప్రజలతో మమేకమై పనిచేసిన నాడు ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా మార్పు అనివార్యమై వ్యవస్థ మార్పునకు దోహదపడవచ్చు.

సెల్:988556394

కార్మికహక్కుల రద్దుపై కన్నెర్ర

వెలుగూరి రాధాకృష్ణమూర్తి
ఏఐటీయుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు

నరేంద్రమోదీ కార్మిక,కర్షక,ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కేంద్ర కార్మికసంఘాలు నిర్ణయించాయి. దేశ సరిహద్దులలో నెలకొన్న పరిస్థితులవల్ల మే నెల 20వ తేదీ జరగాల్సిన సమ్మెను జులై 9వ తేదీకి వాయిదా వేశారు. నాలుగు కార్మిక కోడ్ల రద్దుతోపాటు రూ.26000 కనీసవేతనం, 8గంటల పనిదినం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆశా, అంగన్వాడి తదితర స్కీం వర్కర్ల రెగ్యులరైజేషన్, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశ నిర్వహణ, మరికొన్ని డిమాండ్ల సాధనకోసం ఈ సమ్మె జరగనుంది. వందలాది రైతు సంఘాలకు నాయకత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఈ కార్యాచరణలో పాల్గొనాలని నిర్ణయించటమేగాక, అదేరోజున గ్రామీణ బంద్‌కు పిలుపునివ్వటం ముదావహం. మోదీ అనుసరించిన ఆర్థికవిధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయి. 10 సంవత్సరాలలో పేదరికం17శాతం పెరిగింది. కార్మికుల వేతనాలు 2017-18 స్థాయి కంటే పడిపోయాయి. మరొకవైపు, కార్పొరేట్ కుటుంబాల ఆస్తులు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి.

మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ ఏజెండాను మరింత నిర్దాక్షిణ్యంగా అమలు జరుపుతున్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి 4 కార్మిక కోడ్‌లను అమలుచేయాలని ప్రయత్నించారు. పోరాడి, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులన్నిటినీ రద్దు చేయాలని భావించారు. రాజ్యాంగ స్ఫూర్తినీ, సుప్రీం కోర్టుతీర్పులనూ, అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్‌ఓ) మార్గదర్శకాలన్నిటిని భూస్థాపితం చేయ సంకల్పించారు. కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చాలనుకున్నారు. కార్మిక కోడ్‌ల అమలులోకి వస్తే 8 గంటల పనిదినం, కనీస వేతనాలు, సామాజిక భద్రత, సంఘం పెట్టుకునే హక్కు, సంఘాల రిజిస్ట్రేషన్లు, సంఘాల గుర్తింపు, సమిష్టి బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆందోళనలు చేసే హక్కులు అన్నీ తీవ్రమైన ప్రమాదంలో పడిపోతాయి. గతంలో వంద మంది కార్మికులు పనిచేస్తున్న ఏ సంస్థకైనా కార్మిక చట్టాలు వర్తించేవి. ఇప్పుడు ఆ సంఖ్యను 300కు పెంచారు. దీనివల్ల దాదాపు 70 శాతం పారిశ్రామిక సంస్థలకు ఏ కార్మిక చట్టమూ వర్తించదు. లేబర్ కోర్టులను రద్దుచేస్తున్నారు. కనీస వేతనం నిర్ణయించటానికి అమలులోగల షెడ్యూల్స్ విధానాన్ని రద్దు చేస్తున్నారు. మొత్తం కార్మిక శక్తిలో అసంఘటిత రంగ కార్మికులు 90శాతంఉన్నారు. జీడీపీ లో వీరి వాటా 45శాతం ఉంది. అయినప్పటికీ, కార్మికకోడ్లలో అసంఘటిత కార్మికులకు సంబంధించిన ఊసేలేదు. గతంలో, ఒక కాంట్రాక్టర్ దగ్గర 20మంది కార్మికులు పని చేస్తుంటే లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఇప్పుడు ఈ సంఖ్యను 50కి పెంచారు. దీనివల్ల ఎటువంటి లైసెన్స్ లేకుండానే కాంట్రాక్టర్ తన హవా' కొనసాగించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ దాడి ప్రాథమిక హక్కులపై జరిగేదే తప్ప మరొకటికాదు. అందుకే నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని కార్మికసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దేశంలో మొత్తం పౌరహక్కులపైనే తీవ్రమైన దాడి జరుగుతోంది. కార్మికవర్గ హక్కులపై జరుగుతున్న దాడిని దీనిలో భాగంగానే చూడాల్సి ఉంటుంది.

> మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ ఎజెండాను మరింత నిర్దాక్షిణ్యంగా అమలు జరుపుతున్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి 4 కార్మిక కోడ్‌లను అమలుచేయాలని ప్రయత్నించారు. పోరాడి, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులన్నిటినీ రద్దు చేయాలని భావించారు.

భావప్రకటనా స్వేచ్ఛ, అసమ్మతిగళం వినిపించే హక్కులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వ ఫాసిస్టు విధానంలో భాగంగానే పరిగణించాలి. యుఏపీఏ(న్యాయ విరుద్ధకార్యకలాపాల నిరోధక చట్టం), పీఎంఎల్‌ఏ (డబ్బు దుర్వినియోగ నిరోధక చట్టం)తోపాటు, నూతనంగా అమలులోకి వచ్చిన బీఎన్‌ఎస్ (భారతీయ న్యాయ సంహిత) చట్టాలను పౌర హక్కులపై దాడికి ప్రయోగిస్తున్నారు. ఈ చట్టాల క్రింద ఇప్పటికే, ఎటు వంటి విచారణలేకుండా వేలాదిమంది జైళ్లలో మగ్గుతున్నారు. బీఎన్‌ఎస్ చట్టంలోని 111వ సెక్షన్ ప్రకారం, కార్మికులు సంఘటితంగా తమ హక్కులను డిమాండ్ చేస్తే, దాన్ని సంఘటిత నేరంగా పరిగణించి, తీవ్రమైన జైలు శిక్షలు, పెనాల్టీలు విధించవచ్చు. ఇప్పటికే బీజేపీ పాలిత కొన్ని రాష్ట్రాలలో దీన్ని అమలు జరుపుతున్నారు. రైతాంగ హక్కులపై ప్రయోగించటానికి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారు. రైతు సంఘాల సుదీర్ఘ, సమరశీల పోరాటాల ఫలితంగా వాటిని రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, తిరిగి "నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చరల్ మార్కె టింగ్" "నేషనల్ కో-ఆపరేటివ్ పాలసీ" లాంటి రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పంటల గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీకల్పించాలని రైతాంగం చేస్తున్న డిమాండ్ పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అందుకే రైతు సంఘాలు కూడా ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి. ప్రభుత్వ ఈచర్యలన్నీ, గుప్పెడు మంది కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే! ప్రజాస్వామ్య హక్కులన్నిటినీ బుల్డోజింగ్ చేయటం అందుకోసమే. మోదీ ప్రభుత్వం, కార్పొరేట్ల ప్రయోజనాలకోసం, "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో "జన్ విశ్వాస్" అనేచట్టాన్ని తీసుకు వచ్చింది. కార్మికచట్టాల ఉల్లంఘనలకు విధించే శిక్షల నుంచి, ఈ చట్టంద్వారా పారిశ్రామిక యాజమాన్యాలకు మినహాయింపునిచ్చారు. ఆ విధంగా, చట్టబద్ధ కార్మికహక్కులపై యధేచ్ఛగా, దాడికి పాల్పడేందుకు పారిశ్రామిక యాజమాన్యాలకు స్వేచ్ఛను ప్రసాదించారు. గతంలో 41చట్టాలకింద 180 చర్యలు చట్టప్రకారం నేరాలుగా పరిగణించేవారు. ఇప్పుడు వీటన్నిటిని "నేరం" అనే నిర్వచనం నుంచి తొలగించారు. ఇది చాలదన్నట్లు, ఇటీవల మరో100 నేరాలను "నేరం" నుంచి మినహా యించేందుకు చట్టసవరణలకు అనుమతించారు. ఆ విధంగా మార్పులకు గురైన చట్టాలలో అనేక కార్మిక చట్టాలతోపాటు, బాయిలర్ యాక్ట్, ఫారెస్ట్ యాక్ట్, తేయాకు తోటల చట్టం, తదితర చట్టాలు ఉన్నాయి. పునః రూపకల్పనపేరుతో, "శ్రమ్ సమాధాన్", "శ్రమ్ సువిధ" పోర్టల్సును నిర్వీర్యం చేస్తున్నారు. తద్వారా, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, ఇతర సంస్థలపై కార్మికశాఖ అధికారుల అజమాయిషి రద్దును పూర్తిగావిస్తున్నారు. కార్మికకోడ్ల అమలుకు ముందే ఈ చర్యలకు పాల్పడటం గమనార్హం. దీనితో యాజమాన్యాల దాష్టికం పరాకాష్టకు చేరటానికి మార్గం సుగమం చేశారు.

చట్టాల సంస్కరణలతోపాటు, అనేక భారాలువేసి, ప్రజల నుంచి కొల్లగొట్టి వసూలు చేస్తున్న పన్నుల నుంచి ఇటీవల కార్పొరేట్లకు మరికొన్ని ప్రోత్సాహకాలు ఇచ్చారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం క్రింద వస్తు తయారీరంగంలోనే 14 రకాల పరిశ్రమలకు రూ 1.97 లక్షలకోట్ల రూపాయలు, సెమీ కండక్టర్ల తయారీ రంగానికి క్యాపెక్స్ ప్రోత్సాహం క్రింద రూ76వేలకోట్లు, ఉపాధి ఆధారిత పరిశ్రమలకు 2లక్షల కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఇటువంటి ప్రోత్సాహకాల వల్ల గత 2, 3 సంవత్సరాల కాలంలో ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు మెరుగుపడిన అనుభవాలులేవు. పెట్టుబడులు గణనీయంగా పెరిగిన దాఖలాలు కూడా లేవు. కానీ ప్రభుత్వం మాత్రం "కార్మికుల్నికొట్టి" "కార్పొరేట్లకు పెడుతున్న" విధానాలను బరితెగించి అమలు చేస్తోంది. కార్మికులకు మాత్రం తీవ్రమైన శిక్షలు తప్ప ఎటువంటి ప్రోత్సాహకాలు ఉండవు. పాతపెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) తిరిగి ప్రవేశపెట్టాలని లక్షలాదిమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. కానీ పాలకులు పట్టించుకోవటం లేదు. పైగా, యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని ప్రత్యామ్నాయంగా ముందుకు తీసుకొస్తున్నారు. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (1995) క్రింద కనీస పెన్షన్ పెంచాలనీ, ఈ పథకాన్ని మెరుగుపరచాలని గత పది సంవత్సరాలుగా వస్తున్న డిమాండ్‌ను పట్టించు కోవడంలేదు. బడ్జెట్లో కేటాయింపులు తగ్గించివేస్తూ, గ్రామీణ ఉపాధిహామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. కార్మికవర్గంపై ఫాసిస్ట్ తరహా, నిరంకుశ విధానాలకు పాల్పడుతున్న పాలక వర్గాల తీరును ప్రతిఘటించడం తప్ప కార్మిక వర్గానికి మరో మార్గం ఏముంది?

బడికి దూరంగా 27 కోట్ల చిన్నారులు

ఎం. లక్ష్మీరాజ్యం

ప్రాథమిక దశలో వికాస దీపం వెలిగించి, అనంతర కాలంలో ఆ కాంతుల్ని దేదీప్యమానం చేస్తూ- విజ్ఞానఖనుల్ని, ప్రయోగశీలుర్ని అవతరింప జేయడమే విద్య మౌలిక లక్ష్యం. విజ్ఞానం కోసం పెట్టే పెట్టుబడి ఎప్పటికీ సత్ఫలితాలు అందిస్తుందనేది అక్షరసత్యం. దేశీయంగా అది సక్రమంగా నెరవేరుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం బహిరంగ రహస్యమే! సమాజం నేడు ఎంతగా అభివృద్ధి చెందినా, అనేక మార్పులు వచ్చినా కోట్లాది మంది పిల్లలు విద్యకు దూరంగానే ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో 2023లో దాదాపు 27.2 కోట్ల మంది చిన్నారులు బడికి దూరంగా ఉన్నారని 'ఐక్యరాజ్య సమితి విద్యా శాస్త్ర సాంకేతిక సంస్థ (యునెస్కో) గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ టీం (జీఈఎం) అంచనా వేసింది. గత ఏడాది వేసిన అంచనా కంటే ఇది 2.1 కోట్ల మంది ఎక్కువ కావడం గమనార్హం. జాతీయ ఖండాంతర విద్యా నిబద్ధతలపై పురోగతిని జీఈఎం అంచనావేస్తుంది. ఆరు నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగినవారిని బడికి వెళ్లే వయస్సు వారుగా ఐక్యరాజ్య సమితి నియమాల ప్రకారం వర్గీకరిస్తారు. 2023లో దాదాపు 27.2 కోట్ల మంది చిన్నారులు బడికి దూరంగా ఉన్నారన్న అంచనా ఖచ్చితంగా తక్కువ లెక్క, ఎందుకంటే సంఘర్షణ ఎక్కువగా ప్రభావితమైన 10దేశాల నుంచి వచ్చిన బాహ్య సమాచారం ప్రకారం, ముఖ్యంగా మయన్మార్, సోమాలియా, సూడాన్‌లలో కనీసం 1.3 కోట్ల మంది పిల్లలు, కౌమారదశలో ఉన్నవారు, యువత పాఠశాలలకు దూరంగా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం (దాదాపు 7.8 కోట్లు మంది), లోయర్ సెకండరీ పాఠశాల వయస్సు చిన్నారుల్లో 15 శాత మంది (6.4 కోట్లు), ఉన్నత పాఠశాల వయస్సు చిన్నారుల్లో 31 శాతం (దాదాపు 13 కోట్ల మంది) చిన్నారులు బడికి దూరంగా ఉన్నారని ఆ నివేదిక తెలిపింది.

2030 నాటికి బడి బయట ఉన్న జనాభాను 16.5 కోట్లకు తగ్గించడానికి సమిష్టిగా కట్టుబడి ఉన్నాయని జీఈఎం నివేదిక విశ్లేషించింది. తాము అనుసరిస్తున్న ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా 2030 నాటికి ఆఫ్రికాలో బడి బయట జనాభాను 58లక్షలకు తగ్గించడానికి ఆఫ్రికా దేశాలు సమిష్టి నిబద్ధతను కలిగి ఉన్నాయి. అయితే, 2025 నాటికి ప్రాథమిక, దిగువ సెకండరీ పాఠశాల వయస్సు గల దేశాలలో నాలుగు శాతం పాయింట్లు, ఉన్నత మాధ్యమిక పాఠశాల వయస్సు గల దేశాలలో ఆరు శాతం పాయింట్లు ట్రాక్ నుంచి తప్పుతాయని అంచనా వేసింది. 2025 నాటికి, దేశాల జాతీయ లక్ష్యాలతో పోలిస్తే 75లక్షల మందిని బడిలో చేర్చాలనే లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. ఈ లక్ష్య సాధన వాటికి పెద్ద సవాల్‌గా మారింది. ఎస్‌డీజీ 4కు దేశాలు అందించిన సహకారాన్ని సూచిస్తూ, ఎనిమిది బెంచ్‌మార్క్ సూచికలకోసం దేశాలు నిర్దేశించిన జాతీయ లక్ష్యాల వైపు పురోగతి మూడవ అంచనా ఇది. ఈ అంచనా 2015 నుంచి 2025 వరకు మధ్య కాలాన్ని పరిగణలోకి తీసుకుంటుంది. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం (ప్రీ-ప్రైమరీ విద్యలో 7 శాతం పాయింట్లు ట్రాక్‌పైకి వెళ్లడం), బాల్య విద్యలో భాగస్వామ్యాన్ని విస్తరించడం (9 శాతం పాయింట్లు ట్రాక్‌పైకి వెళ్లడం, కోవిడ్ 19 ప్రభావం), ప్రాథమిక విద్య ముగిసే సమయానికి కనీస పఠన నైపుణ్యాన్ని సాధించడం (11 శాతం పాయింట్లు ట్రాక్‌పైకి వెళ్లడం, డేటా లేకపోవడం వల్ల ఆటంకం) వంటి కారణాల వల్ల 2025 జాతీయ లక్ష్యాల సాధనలో దేశాలు చాలా వెనుకబడి ఉన్నాయి. విద్య కోసం వ్యయం చేయడంలో చాలా దేశాలలోని ప్రభుత్వాలు వెనుకడుగువేస్తు న్నాయని ఆ నివేదిక విమర్శించింది. అనేక దేశాలు విద్యకు స్థూలదేశీయోత్పత్తిలో 4శాతం, మొత్తం ప్రభుత్వ వ్యయంలో 15 శాతం కూడా విద్య కోసం ఖర్చు చేయడంలేదని ఆందోళన వ్యక్తంచేసింది.

నూతన నమోదు, హాజరు డేటాను పరిగణనలోకి తీసుకోవడం, ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల ప్రభుత్వం అక్కడి బాలికల విద్యపై నిషేధం విధించడం బడికి దూరంగా ఉన్న చిన్నారుల సంఖ్య భారీగా పెరగడానికి ప్రధాన కారణాలుగా ఆ నివేదిక పేర్కొంది. ఐరాస ఆధునికీకరించిన జనాభా అంచనాలు కారణంగా ఈ చిన్నారుల సంఖ్య భారీగా పెరిగిందని కూడా ఆ నివేదిక వెల్లడించింది. బడికి దూరంగా ఉంటే చిన్నారుల సంఖ్య ఈ నివేదిక వెల్లడించిన సంఖ్య కన్నా ఇంకా అధికంగా ఉండే అవకాశంలేకపోలేదు. ఈ విషయాన్ని ఆ నివేదిక కూడా నిర్ధారించింది. ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సంఘర్షణల వాతావరణం నెలకుంది. సరైనా గణాంకాల సేకరణకు ఇటువంటి పరిస్థితులు తీవ్ర అంతరాయం కలిగిస్తాయి. బడికి బయట ఉన్న చిన్నారులపై సంఘర్షణల వాతావరణం ప్రభావాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారని తెలిపింది.

ఇక మన దేశానికి వస్తే, ప్రస్తుతం దేశంలోని 19-23 సంవత్సరాల వయసుగల యువతీ యువకుల్లో 28.4శాతం మంది మాత్రమే ఉన్నత విద్యను అందుకోగలుగుతున్నారు. గత ఏడాది మార్చి 7న విడుదల చేసిన ఉన్నత విద్యపై అఖిల భారత సర్వే 2022-23 ప్రకారం ఉన్నత విద్యలో విద్యార్థుల భాగస్వామ్య రేటు లేదా స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 28.4 శాతానికి పెరిగింది. ఇది 2020-21 నుంచి 1.1 శాతం పెరుగుదల. చండీగఢ్, పుదుచ్చేరి, ఢిల్లీ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, తెలంగాణలో అత్యధిక జీఈఆర్ నమోదైంది. భారత దేశంలో ఉన్నత విద్య అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆ సర్వే తెలిపింది. ప్రాప్యత, సమానత్వాన్ని నిర్ధారించడం ఉన్నత విద్య ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు వంటి అట్టడుగు వర్గాలకు మధ్య గణనీయమైన అసమానత ఉంది. వారు నాణ్యమైన ఉన్నత విద్యను పొందడంలో గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటున్నారని ఆ సర్వే పేర్కొంది. దేశంలోని ఉన్నత విద్యాసంస్థలు అందిస్తున్న విద్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పరిశోధనలు చాలా పరిమితంగా జరుగుతున్నాయి. బోధనా సంస్థలు, పరిశోధనా సంస్థలు వేర్వేరుగా ఉండడమే అందుకు కారణమని తేల్చింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో పరిశోధన, అభివృద్ధికి వెచ్చిస్తున్న ఖర్చు, పరిశోధకుల సంఖ్య చాలా తక్కువని 'యునెస్కో నివేదిక' పేర్కొన్నది. యూజీసీ, ఏఐసీటీఈ, న్యాక్ తదితర సంస్థల్లోని అక్రమాలు, అవకతవకలు, బయటివారి నియామకాలు, పెత్తనాలవల్ల ఉన్నత విద్య అభివృద్ధికి నోచుకోవడంలేదని కస్తూరి రంగన్ కమిటీ ఎత్తిచూపింది. ప్రతిభని కాదని సీనియారిటీకే అవకాశాలు ఇవ్వడంవల్ల రీసర్చ్ ఇన్నోవేషన్‌కి ప్రోత్సాహం కొరవడిందని వ్యాఖ్యానించింది. దేశంలో ప్రైవేటు సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు దారుణంగా ఉన్నట్లు 'నీతి ఆయోగ్' స్వయంగా నిర్ధారిస్తోంది. ఈ దుర్బల పునాదులపై సుదృఢ విద్యాసౌధం నిర్మాణం పగటి కలే. ఈ నేపథ్యంలో నూతన విద్యావిధానం ముసాయిదాలోని ప్రతిపాదనలు విద్యను కార్పొరేట్ పరంచేసేలా ఉన్నాయి. పేదలకు చదువును దూరం చేసేందుకు దోహదపడతాయనడంలో సందేహంలేదు.

నాణ్యత లేకపోవడం, ఉద్యోగానికి ఉపయోగపడకపోవడం మన ఉన్నత విద్యలోనున్న పెద్ద బలహీనత. ఉద్యోగాలకోసం వెళ్లే గ్రాడ్యుయేట్లలో సగం మందికి ఇంటర్వ్యూలో పాల్గొనే మెళుకువలు కూడా ఉండడం లేదని 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్ -2023' వెల్లడించింది. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 20శాతం మంది మాత్రమే తగిన ఉద్యోగాలకు అర్హులవుతున్నారని ప్రైవేట్ ఏజెన్సీలు నిర్వహించే ఎంప్లాయబిలిటీ రిపోర్ట్ పేర్కొంది. ఇలాంటి మౌలిక లోపాలు, లొసుగులు, బలహీనతలను అధిగమించే సిఫార్సులు మాత్రం ముసాయిదాలో కనిపించవు. మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, ఆర్థికంగా చేయూత కొరవడడం మన విశ్వవిద్యాలయాల పురోగతికి తీవ్ర ప్రతిబంధకాలు సృష్టిస్తోంది. రాశికాదు, వాసి ఘనంగా ఉండాలి. అధిక కేటాయింపులతోపాటు సిబ్బంది ఖాళీల సత్వర భర్తీ, భావి సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా కోర్సుల రూపకల్పన, అడుగడుగునా జవాబుదారీతనం సాకారమైతేనే మన ఉన్నత విద్య గాడినపడే అవకాశం ఉంటుంది. బడి చదువులు సవ్యంగా పట్టాలకు ఎక్కక, ఉన్నత విద్యారంగం గుల్లబారుతోంది. ఏదేమైనా సరే వివిధ దేశాలు తమ జాతీయ లక్ష్యాలను సాధిం చడంలో విఫలమైతే బడికి దూరంగా ఉండే విద్యార్థుల సంఖ్య పెరుగుదల కొనసాగుతూనే ఉంటుందని, ఒకవేళ దేశాలు తమ లక్ష్యాలను సాధించగలిగితే 2030 నాటికి బడికి దూరంగా ఉన్న చిన్నారుల సంఖ్యను 16.5 కోట్లకు తగ్గించవచ్చునని జీఈఎం నివేదిక పేర్కొంది.

రాజ్‌భవన్ నుంచి కేరళ మంత్రి వాకౌట్

తిరువనంతపురం: రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన అధికారిక కార్యక్రమం నుండి కేరళ విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టి వాకౌట్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌కి చెందిన భారతమాత ఫొటోను గవర్నర్ రాజ్‌భవన్‌లో ప్రదర్శించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజ్య పురస్కార అవార్డు ప్రదానోత్సవం నుండి బయటకు వచ్చిన తర్వాత శివన్ కుట్టి ఒక ప్రకటన విడుదల చేశారు. దేశభక్తి అంటే రాజ్యాంగ విలువలను, ప్రతి పౌరుడి గౌరవాన్ని కాపాడటమని, భారతదేశానికి నిర్వచనమైన వైవిధ్యాన్ని కాపాడటమని గవర్నర్ గుర్తుంచుకోవాలని శివన్ కుట్టి అన్నారు. భారత జాతీయవాదం రాజ్యాంగంలో పొందుపరిచిన సమ్మిళిత, ప్రజాస్వామ్య దృక్పథంపై ఆధారపడి ఉందన్నారు. మన గణతంత్రం బహుళత్వ, సమాఖ్య, లౌకికవాదం నుండి పుట్టిందని తెలిపారు. కాషాయ జెండాను పట్టుకున్న స్త్రీ ఫొటోనే దేశభక్తికి ఏకైక చిహ్నంగా పేర్కొనడం ఈ ప్రాథమిక వాస్తవికతను విస్మరిస్తుందని, దేశభక్తిని ఒకే దృక్పథం నుండి చూడాలని సూచించడం సముచితం కాదని, ఇది మన స్వాతంత్ర్య పోరాట చరిత్రను బలహీన పరుస్తుందని శివన్‌కుట్టి విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక అజెండాను ప్రోత్సహించేందుకు గవర్నర్ కార్యాలయాన్ని వినియోగించరాదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించిన మరుసటి రోజు ఈ ఘటన చోటుచేసుకుంది. రాజ్‌భవన్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌కి సంబంధించి చిత్రాల ప్రదర్శన గురించి ఆయన ప్రస్తావించారు. ఈ నెల ప్రారంభంలోనూ వ్యవసాయ మంత్రి పి. ప్రసాద్ రాజ్‌భవన్‌లో ప్రభుత్వం నిర్వహించే పర్యావరణ దినోత్సవాలకు హాజరుకాలేదు. రాజ్‌భవన్‌లోని సెంట్రల్ హాల్‌లో సింహంపై కాషాయ జెండా పట్టుకున్న భారత మాత ఫొటోను ప్రదర్శించడాన్ని ఆయన వ్యతిరేకించారు.

త్వరలోనే ఇంగ్లీష్ రహిత భారత్: అమిత్ షా

న్యూఢిల్లీ: విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. 'ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలి' అని అమిత్ షా పిలుపునిచ్చారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

మహిళతో మంత్రి సన్నిహిత ఫొటోలు

పంజాబ్‌లో రాజకీయ దుమారం

చండీగఢ్: పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మంత్రి రవ్‌జోత్ సింగ్ ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు బయటపడ్డాయి. శిరోమణి అకాలీదళ్ నేత బిక్రమ్ సింగ్ ఈ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ విషయంపై రాష్ట్రంలో రాజకీయ దుమారం చెలరేగింది. రవ్‌జోత్‌కు చెందిన ఫొటోలను బిక్రమ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఆప్ ప్రభుత్వంలోని మంత్రి సోదరీమణుల గౌరవానికి భంగం కలిగించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలి. మంత్రి పదవి నుంచి తొలగించాలి' అని రాసుకొచ్చారు. ఈ పోస్టును ఆప్ అధినేత కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌కు ట్యాగ్ చేశారు. ఈ పోస్టుపై మంత్రి రవ్‌జోత్ ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ... అవి ఏఐతో సృష్టించినవన్నారు. ఆ పార్టీ తనపై వ్యక్తిగతంగా దాడి చేయడమే కాకుండా... ఓ మహిళ గౌరవాన్ని అవమానించిందన్నారు. సమాజంలోని మహిళలపై వారికున్న గౌరవం ఏమిటనేది ఇలా బయటపడిందన్నారు. లూధియానా ఉప ఎన్నికల్లో ఆప్ పార్టీ చేతిలో ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడుతుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా ముందుకువెళతామన్నారు. ఈ వివాదంపై ఆప్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అమన్ అరోరా మంత్రికి మద్దతుగా నిలిచారు. అకాలీదళ్ మురికి రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు.

'హౌసింగ్'లో ముస్లింలకు 15 శాతం కోటా: సిద్దరామయ్య

బెంగళూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహనిర్మాణ పథకాల్లో ముస్లింలకు 15 శాతం రిజర్వేషన్లు పెంచే ప్రతిపాదనను కర్నాటక కేబినెట్ గురువారం ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖలు అమలు చేసే అన్ని హౌసింగ్ పథకాల్లో ముస్లింలకు ప్రత్యేక కోటాను మంజూరు చేసింది. మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లను ప్రస్తుత 10 శాతం నుండి 15 శాతానికి పెంచే ప్రతిపాదనకు గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ మద్దతిచ్చారు. 'వాస్తవానికి మనం జనాభా ఆధారంగా ఆలోచించాలి. పట్టణ జనాభాలో ఎక్కువ మంది మైనారిటీలు, పేదలు ఉన్నారు' అంటూ ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ రిజర్వేషన్లను సమర్థించారు. ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఇతరులకు కేటాయించలేదని, అందుకే ముస్లిం కోటాను 10 నుంచి 15 శాతానికి పెంచామని అన్నారు. మైనారిటీలు చాలాకాలంగా రిజర్వేషన్లు పెంచాలని అభ్యర్థిస్తున్నారని, దీంతో ఖాళీగా ఉన్న భవనాలను నింపే క్రమంలో 15 శాతం కోటా కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని మంత్రి ఎంసీ సుధాకర్ కూడా సమర్థించారు. కేంద్రం ఇప్పటికే మైనారిటీలకు 15 శాతం కేటాయింపులు చేస్తోందని, దానికి అనుగుణంగా రాష్ట్రం కూడా చర్యలు తీసుకుందని చెప్పారు. మరోవైపు, కర్నాటక ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకత(సవరణ) బిల్లు-2025ను ప్రవేశపెట్టింది. రూ.2 కోట్ల కన్నా తక్కువ విలువ చేసే ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బిల్లును ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే, ఈ బిల్లును మే 22న కర్నాటక గవర్నర్, రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. ప్రధాని మోదీ కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలుమార్లు విమర్శించారు. మతం ఆధారంగా టెండర్లలో రిజర్వేషన్ మంజూరు చేస్తున్నారని, ఇది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కుల్ని హరిస్తుందని ఆరోపించారు.

మునీర్‌కు ట్రంప్ విందు...

భారత దౌత్యానికి పెద్ద ఎదురుదెబ్బ

- మోదీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శ
- చైనాతో సంబంధాలపై పార్లమెంటులో సమగ్ర చర్చకు డిమాండ్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్...పాకిస్థాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్‌ను విందు ఇచ్చిన క్రమంలో మోదీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శల దాడి చేసింది. ఈ పరిణామం భారత దౌత్యానికి భారీ ఎదురు దెబ్బగా అభివర్ణించింది. మునీర్ పాకిస్థాన్ దేశాధినేత లేదా ప్రభుత్వ అధిపతి కాదు...సాక్షాత్తు ఆ దేశ సైన్యానికి అధిపతి అని... అయినప్పటికీ ఆయనను ట్రంప్ భోజనానికి ఆహ్వానించడమే కాకుండా ఆయపై ప్రశంసలు కురిపించారని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. "జమ్మూకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడి జరగడానికి కొన్నిరోజుల ముందే భారత్ లక్ష్యంగా ఆసిమ్ మునీర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆర్మీ, ఐఎస్ఐ అండదండలతోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది'" అని గుర్తుచేస్తూ ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "ఇది భారత దౌత్యానికి భారీ దెబ్బ" అని ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. కాగా జాతీయ భద్రతా సమస్యలు, ఉత్తర పొరుగు దేశంపై ఆర్థికంగా ఆధారపడుతున్న కారణంగా చైనాతో భారతదేశ సంబంధాలపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని కూడా జైరామ్ డిమాండ్ చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అలాంటి చర్చకు అనుమతిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గల్వాన్ లోయలో ఘర్షణ జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జైరామ్ ఓ ప్రకటన చేస్తూ... పైవిధంగా స్పందించారు. చైనా దురాక్రమణపై స్పందించడంలో మోదీ సర్కారు విఫలమైందని, ప్రాదేశికంగా, ఆర్థికంగా కీలకమైన భూమిని వదిలేసిందని ఆరోపించారు. 'జూన్ 15, 2020న గల్వాన్‌లో దేశం కోసం మన 20 మంది ధైర్యవంతులైన సైనికులు తమ ప్రాణాలను అర్పించిన నాలుగు రోజుల తర్వాత ప్రధాని మోదీ చైనాకు క్లీన్ చిట్ ఇచ్చిన ఐదవ వార్షికోత్సవం ఈరోజు" అని రమేష్ 'ఎక్స్' వేదికగా ఎద్దేవా చేశారు. మోదీ వివాదాస్పద ప్రకటన చేస్తున్న వీడియో క్లిప్‌ను కూడా జైరామ్ తన ట్వీట్‌కు అనుసంధానించారు. చైనాతో అక్టోబరు 21, 2024న జరిగిన సైనిక ఉపసంహరణ ఒప్పందం... భారత్ సున్నితమైన ప్రాంతాలలో తన సొంత భూభాగంలో గస్తీ తిరిగే సామర్థ్యాన్ని దెబ్బతీసిందని ఆయన పేర్కొన్నారు. దీని ప్రకారం భారత గస్తీ దళాలు డెప్సాంగ్, డెమ్‌చోక్, చుమార్‌లలో తమ గస్తీ కేంద్రాలను చేరుకోవడానికి చైనా సమ్మతిని కోరుతున్నాయన్నారు. గల్వాన్, హాట్ స్ప్రింగ్, పాంగోంగ్ త్సోలోని బఫర్ జోన్‌లు ప్రధానంగా భారత క్లెయిమ్ లైన్‌లో ఉన్నాయన్నారు. ఏప్రిల్ 2020కి ముందు వారు అనియంత్రిత ప్రాప్యత కలిగి ఉన్న పాయింట్లను మన దళాలు తాకే అవకాశం లేకుండా శాశ్వతంగా నిరోధిస్తున్నట్లు కనిపిస్తోందని జైరామ్ పేర్కొన్నారు. 'ఇది మన సాయుధ దళాలు కోరిన స్థితికి ఏమాత్రం దగ్గరగా లేదు. భారతదేశానికి అపారమైన ప్రాదేశిక ఎదురుదెబ్బను సూచిస్తుంది" అని ఆయన అన్నారు. భారత్-చైనా మధ్య తీవ్ర వాణిజ్య అసమతుల్యతను కూడా జైరామ్ ఎత్తి చూపారు. 'చైనా నుండి దిగుమతులు పెరుగుతున్నాయి - ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ బ్యాటరీలు, సౌర ఫలకలు, టెలికాం, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ముఖ్యమైన రంగాలు చైనా దిగుమతులపై తీవ్రంగా ఆధారపడి ఉన్నాయి. 2024-25లో చైనాతో వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో 99.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది" అని జైరామ్ వివరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ సైన్యానికి మద్దతు ఇవ్వడంలో చైనా ప్రత్యక్ష పాత్ర పోషించిందని జైరామ్ ఆరోపించారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ సైనిక కార్యకలాపాలలో చైనా కీలక పాత్ర పోషించిందని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. జే-10సి ఫైటర్, పీఎల్-15ఇ ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వంటి ఆయుధ వ్యవస్థల సరఫరా కంటే ఈ మద్దతు లోతుగా ఉంటుంది. ఇది ఏఐ, మల్టీ-డొమైన్ ఆపరేషన్లు, స్టెల్త్ డొమైన్‌లను కలిగి ఉంటుంది, పాకిస్థాన్ సమీప భవిష్యత్తులో చైనా నుండి 40 జే-35 స్టెల్త్ ఫైటర్‌లను పొందే అవకాశం ఉంది" అని జైరామ్ అన్నారు. మన ఉత్తర, పశ్చిమ సరిహద్దులను కలుపుకుని ఒకే కూటమి నుంచి సవాల్ పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్ల తీవ్రతను గుర్తించి, వ్యూహాత్మక జాతీయ ప్రతిస్పందనను రూపొందించడంలో అన్ని పార్టీలను భాగస్వామ్యం చేయాలని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. 'గత ఐదు సంవత్సరాలుగా చైనాపై వివరణాత్మక చర్చకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిస్తోంది. అది జరగలేదు. రాబోయే పార్లమెంట్ సమావేశంలో ప్రధానమంత్రి చివరకు అలాంటి చర్చకు అంగీకరిస్తారని మేము ఆశిస్తున్నాము' అని జైరామ్ అన్నారు. కాగా "భారత ప్రధానమంత్రి పదవి, విదేశాంగ శాఖ అనేవి ఇప్పుడు బలహీనంగా మారిపోయాయా" అని కేంద్ర సర్కారును కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ విభాగాధిపతి పవన్ ఖేరా ప్రశ్నించారు.

అరగంట పాటు ప్రధాని మోదీతో మాట్లాడిన తర్వాత కూడా భారత్ - పాక్ సైనిక ఘర్షణను ఆపింది తానేనని ట్రంప్ చెప్పుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. మంగళవారం రాత్రి 35 నిమిషాల వ్యవధిలో భారత్ వైఖరి గురించి ట్రంప్‌కు మోదీ స్పష్టంగా వివరాలను చెప్పలేకపోయారా అని పవన్ ఖేరా నిలదీశారు. ప్రధానమంత్రి కార్యాలయం, విదేశాంగ శాఖ భారతదేశ వైఖరిని ప్రతిబింబించేలా పనిచేయలేకపోతున్నాయని విమర్శించారు.

క్షిపణులు, బాంబుల మోతతో భయపడ్డాం

స్వదేశానికి చేరిన భారత విద్యార్థులు

న్యూఢిల్లీ: 'క్షిపణులు దూసుకొస్తున్నాయి. బాంబుల మోత భయపెడుతోంది. అదో భయంకరమైన కాళరాత్రి. ఏం జరుగుతుందో తెలియక... ఏం చేయాలో పాలుపోక బొమ్మల్లా నిల్చుండి పోయాం' అని ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు తాము ఎదుర్కొన్న భయానక పరిస్థితిని వివరించారు. ఇరాన్‌లోచిక్కుకు పోయిన భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్రం 'ఆపరేషన్ సింధు' ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలిసారిగా ఊర్మియా యూనివర్సిటీకి చెందిన 90 మంది మెడికల్ విద్యార్థులు సహా 110 మంది ఢిల్లీ చేరుకున్నారు. తొలుత టెహ్రాన్ నుంచి పొరుగుదేశం అర్మేనియాకు వెళ్లి... అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. ఢిల్లీలో దిగిన మీర్ ఖలీఫ్ అనే ఎంబీబీఎస్ విద్యార్థి మీడియాతో మాట్లాడుతూ 'క్షిపణులు, బాంబులను ప్రత్యక్షంగా చూశాం. బాంబుదాడుల తీవ్రతకు భవనాలు కంపించిపోయాయి. అక్కడ భయానక వాతావరణం ఉంది. ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మా పక్క భవనంలో నివసిస్తున్న ఓ వ్యక్తి చనిపోయాడు. ఇంకా చాలామంది భారతీయ విద్యార్థులు అక్కడ చిక్కుకున్నారు. వారంతా తొందర్లోనే స్వదేశానికి రావాలి. ఇరాన్‌లో ఉన్నవారిని రప్పించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. భారత రాయబార కార్యాలయం మమ్మల్ని సంప్రదించిన తర్వాతే ఇంటికి చేరగలమన్న నమ్మకం ఏర్పడింది. మీడియాలో కనిపిస్తున్న దృశ్యాలు యదార్థం. అక్కడ భీతావహ పరిస్థితులు ఉన్నాయి' అని పేర్కొన్నారు. కాగా, ఇరాన్ నుంచి భారత్‌కు చేరుకున్న వైద్య విద్యార్థులకు కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్వాగతం పలికారు. ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లి... వారితో నేరుగా మాట్లాడారు. అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మిగతా వారిని కూడా స్వదేశానికి రప్పించేందుకు కేంద్రం తీవ్ర కసరత్తు చేస్తోందని చెప్పారు. తుర్కెమిస్థాన్ మీదుగా మరికొందర్ని రప్పించేందుకు ఇప్పటికే విమానాలు సిద్ధం చేసి ఉంచినట్లు చెప్పారు. అవసరమైన అనుమతులు రాగానే కార్యాచరణ అమలు చేస్తామన్నారు.

జస్టిస్ వర్మ ఇంట్లో సొమ్ము నిజమే

సుప్రీం ప్యానల్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో డబ్బు బయటపడిన మాట వాస్తవమేనని ముగ్గురు న్యాయమూర్తుల బృందం నిర్ధారించింది. ఆయన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న వేళ అధికారిక నివాసంలో పెద్ద సంఖ్యలో కాలిపోయిన నోట్ల కట్టలను గుర్తించారు. దీనిపై ప్యానల్ తాజాగా 60 పేజీల నివేదిక ఇచ్చింది. ఇందులో 30 తుగ్లక్ క్రిసెంట్ రోడ్డులోని న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో నోట్ల కట్టలు గుర్తించడం వాస్తవమేనని పేర్కొంది. ఆ సొమ్ములున్న స్టోర్‌రూమ్ నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల ఆధీనంలోనే ఉందని అభిప్రాయపడింది. దీనికి సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అగ్నిప్రమాదంలో దగ్ధమైన నోట్లను మార్చి 15వ తేదీ తెల్లవారు జామున అక్కడి నుంచి తొలగించడమే బలమైన సాక్ష్యమని వెల్లడించింది. ఈ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల స్టోర్‌రూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. తమకు లభించిన ఎలక్ట్రానిక్, ప్రత్యక్ష ఆధారాలను దృష్టిలో ఉంచుకొని సీజేఐ ఆరోపణలు నిజమేనని తేలుతోందని నివేదిక పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని అభిప్రాయపడింది. కాగా, జస్టిస్ వర్మపై దర్యాప్తులో భాగంగా 10 రోజులపాటు 55 మంది సాక్షులను విచారించారు. వారి వాంగ్మూలాలను వీడియోలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఓ సాక్షి మాట్లాడుతూ 'నేను ఆ గదిలోకి వెళ్లాను. అక్కడ కుడివైపు నేలపై రూ.500 నోట్ల కట్టలు భారీగా పడున్నాయి. దిగ్భ్రాంతికి గురయ్యాను. నా జీవితంలో నేలపై అంత మొత్తం సొమ్ము పడి ఉండటాన్ని చూడలేదు' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ కుమార్తె దియా, ఆయన ప్రైవేటు కార్యదర్శి రాజేందర్‌సింగ్ కార్కి తదితరులను కూడా ప్యానెల్ విచారించింది.

థగ్ లైఫ్ సినిమా విడుదల చేయాల్సిందే

కర్నాటకకు 'సుప్రీం' ఆదేశాలు

న్యూఢిల్లీ: కమల్‌హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమా కర్నాటకలో విడుదల చేయాల్సిందే అని సుప్రీంకోర్టు తెలిపింది. అది ప్రభుత్వ బాధ్యత అని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. సినిమా విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్రానిదే అని స్పష్టం చేసింది. సినిమా విడుదలను అడ్డుకుంటామని బెదిరిస్తున్న వారిని నియంత్రించాలని, దీనిపై చర్యల ప్రణాళిక రూపొందించాలని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. సుప్రీం చివాట్లతో దిగివచ్చిన కర్నాటక ప్రభుత్వం నిరసనకారులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటున్నవారికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సుప్రీం తీర్పుతో సంతృప్తి చెందానని, కేసును మూసివేస్తున్నట్లు కమల్ తెలిపారు. కేసు వాదనల సమయంలో కర్నాటక సర్కారు ఇచ్చిన హామీలను ధర్మాసనం ఆలకించింది. ఒకవేళ ఎవరైనా సినిమాను అడ్డుకుంటే వారిపై కర్నాటక సర్కారు తీవ్ర చర్యలు తీసుకుంటుందని సుప్రీం తెలిపింది. థగ్‌లైఫ్ సినిమా విడులైతే థియేటర్లకు రక్షణ కల్పించనున్నట్లు కర్నాటక ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. తమిళం నుంచే కన్నడ భాష పుట్టినట్లు ఫిల్మ్ స్టార్ కమల్‌హాసన్ ఇటీవల వ్యాఖ్యలు చేయడంతో వివాదం మొదలైంది. దీంతో అతడు నటించిన థగ్‌లైఫ్ సినిమా కర్నాటకలో విడుదల చేయకుండా అడ్డుకున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కమల్‌హాసన్ కోర్టును ఆశ్రయించారు. ఈ నెల ఐదో తేదీనే థగ్‌లైఫ్ సినిమా విడుదల కావాల్సి ఉంది కానీ వివాదం వల్ల కర్నాటకలో ఆ సినిమాను బ్యాన్ చేశారు.

హత్యకు గురైన మాజీ మంత్రి నివాసాల్లో ఐటీ సోదాలు

భువనేశ్వర్: హత్యకు గురైన (2023లో) ఒడిశా మాజీ మంత్రి , బీజేపీ సీనియర్ నేత నబా కిశోర్ దాస్ అక్రమార్జన కేసులో గురువారం ఆదాయం పన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుమారు 20 ప్రదేశాల్లో ఐటీ అధికారులు సోదాలు చేశారు. తెల్లవారుజామున ఐదు గంటలకే తనిఖీలు మొదలయ్యాయి. జార్సుగూడ, సంబల్‌పూర్, న్యూఢిల్లీల్లో ఉన్న దివంగత మాజీ మంత్రి నివాసాలతో పాటు బంధువులు, అనుబంధ వ్యాపారవేత్తల ఇళ్లల్లోనూ ఐటీ శాఖ తనిఖీలు నిర్వహించింది. భువనేశ్వర్‌లో ఉన్న ఇళ్లు మాత్రం ప్రస్తుతం మూసివేశారు. నబా కిశోర్ దాస్‌తో లింకున్న హోటల్ నికీ, ఇతర ప్రాపర్టీలపై కూడా ఐటీ దాడులు జరిగాయి. పన్ను ఎగవేతతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయి. 180 మంది ఆదాయ పన్ను అధికారులు ఈ దాడులు చేపట్టారు. సుమారు 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 60 వాహనాలు, సైంటిఫిక్ అనాలిస్ బృందం వారితో ఉన్నాయి. మాజీ మంత్రి కిశోర్ దాస్ కుమార్తె, జార్సుగూడ మాజీ ఎమ్మెల్యే దీపాలీ దాస్ ప్రస్తుతం ఆచూకీలో లేరు. ఆమె ఆఫీసు మూసి ఉందారు. 2023 జనవరి 29న ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న నబా కిశోర్ దాస్‌ను అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ తన రివాల్వర్‌తో కాల్చి చంపాడు.

మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో కోత?

న్యూఢిల్లీ: ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీలు వందలాది మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 130 కంపెనీలు 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించగా... తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. తాజా రౌండ్ సేల్స్ విభాగంలో ఉండనున్నట్లు సంస్థ అధికారులను ఊటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అయితే, ఈ లేఆఫ్స్‌పై మైక్రోసాఫ్ట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. కాగా, ఈ ఏడాది మేలో తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు ఆరు వేల మందిని తొలగించింది. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని తెలిపింది.

బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

బెంగళూరు: దేశంలో విమానాశ్రయాలు, విద్యాసంస్థలు, కోర్టులకు... ఇలా వరుసగా బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం మరోసారి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. అగంతకులు విమానాశ్రయ భద్రతా దళానికి బెదిరింపు మెయిల్ పంపారు. టాయిలెట్ పైప్‌లైన్‌లో బాంబు ఉంచినట్లు అందులో పేర్కొన్నారు. ఒకవేళ ప్లాన్ ఏ విఫలమైతే, తమ వద్ద ప్లాన్ బీ ఉందని హెచ్చరించారు. 'ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను ఉరితీయడం తప్పు' అంటూ అందులో ప్రస్తావించారు. బెదిరింపు మెయిల్‌తో అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. దీంతో అది నకిలీ బెదిరింపుగా నిర్ధారించారు. ఐడీ ఆధారంగా అగంతకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపులు రావడం ఈ నెలలో ఇది మూడోసారి. 13, 16 తేదీల్లో ఇలాంటి బెదిరింపు మెయిల్సే వచ్చాయి. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



అభిప్రాయభేదాలున్నా... కాంగ్రెస్‌ను వీడను: శశి థరూర్

- థరూర్‌పై సొంత పార్టీ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నితన్ తీవ్ర విమర్శలు
- ఆయన మనసు మోదీ వద్ద, శరీరం కాంగ్రెస్‌లో ఉందని వ్యాఖ్య

తిరువనంతపురం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో తనకు కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలున్నట్లు అంగీకరించారు. అయితే పార్టీని విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇటీవలే అమెరికా, బ్రెజిల్ తదితర ఐదు దేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' దౌత్య కార్యక్రమంలో భాగంగా అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించి కేరళ రాజధానికి తిరిగివచ్చిన థరూర్, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "మీ మనసులో ఏ ప్రశ్నలున్నాయో నాకు తెలుసు, కానీ నేను వాటికిప్పుడు సమాధానం చెప్పదలచుకోలేదు. ఇటీవల మా సీనియర్ నాయకులు తెన్నల బాలకృష్ణ పిళ్లై కన్నుమూశారు, నేను అక్కడికి వెళుతున్నాను" అని థరూర్ తొలుత అన్నారు. అనంతరం, "అవును, కాంగ్రెస్ నాయకత్వంతో నాకు అభిప్రాయ భేదాలున్నాయి. ఆ విషయం అందరికీ తెలిసిందే. కొన్ని విషయాలు బహిరంగంగానే ఉన్నాయి. నేను వారిని (నాయకత్వాన్ని) నేరుగా కలుస్తాను, వారు నన్ను నేరుగా అడిగితే సమాధానం కూడా చెబుతాను. నేనెక్కడికీ వెళ్లడం లేదు... నేను కాంగ్రెస్ వాదిని" అని ఆయన తేల్చిచెప్పారు.

గురువారం జరుగుతున్న కీలకమైన నిలంబూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారానికి ఎందుకు హాజరుకాలేదని అడిగిన ప్రశ్నకు, "నన్ను దానికి ఆహ్వానించలేదు" అని థరూర్ క్లుప్తంగా బదులిచ్చారు. అయితే, థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీకే చెందిన మరో లోక్‌సభ సభ్యుడు రాజ్‌మోహన్ ఉన్నితన్ తీవ్రంగా స్పందించారు. "నిలంబూర్‌లో జరుగుతున్నది ఎవరి పెళ్లి కాదు ఆహ్వానించడానికి!" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ పార్టీలో నాయకులే ప్రచార కమిటీకి తమ లభ్యత గురించి తెలియజేస్తారు. ఏ నాయకుడు ఎక్కడ ప్రచారం చేయాలో కమిటీ నిర్ణయిస్తుంది. ఏ కాంగ్రెస్ నాయకుడికీ ఆహ్వానం పంపరు" అని ఉన్నితన్ తెలిపారు. "కొంతకాలంగా ఆయన (థరూర్) మనసు ప్రధాని మోదీ దగ్గర, శరీరం కాంగ్రెస్ పార్టీలో ఉంది. తానెక్కడికి వెళుతున్నాడో థరూర్ కి తప్ప అందరికీ తెలుసు. తనకు తాను తప్ప మరెవరిపైనా ఆయనకు విధేయత లేదు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తాను ఈ స్థాయికి ఎలా చేరుకున్నాడో ఎప్పుడూ మరిచిపోతుంటాడు" అని ఉన్నితన్ తీవ్ర విమర్శలు చేశారు. గతంలో థరూర్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు 'ఆపరేషన్ సిందూర్' ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించడం, ప్రధాని నరేంద్ర మోదీని, ముఖ్యంగా సరిహద్దు తీవ్రవాదంపై ఆయన ప్రభుత్వ స్పందనను ప్రశంసించడం వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ నుంచి వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. పార్టీ ఆయనను అధికారికంగా నామినేట్ చేయనప్పటికీ థరూర్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

లాడెన్‌ను మరచిపోయారా?

పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసీం మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విందు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం కల్పించడంలో పాక్ పాత్రను అమెరికా మరచిపోకూడదన్నారు. 'వరల్డ్ ట్రేడ్ సెంటర్ దాడిలో ప్రధాన సూత్రధారి ఒసామా బిన్ లాడెన్ ఎపిసోడ్‌ను పాక్ బృందాన్ని కలిసిన కొంతమంది చట్టసభ సభ్యులు మరచిపోయినప్పటికీ అమెరికా ప్రజలు మాత్రం అంత తొందరగా మరచిపోలేరు. ఇటువంటి వ్యక్తి దొరికేవరకు... ఓ సైనిక క్యాంపు దగ్గర పాక్ దాచిపెట్టిన విషయాన్ని అమెరికన్లు అంత తొందరగా మరచిపోరు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఉగ్రవాదులకు శిక్షణాపరంగా, ఆర్థికంగా మద్దతు ఇవ్వకూడదనే విషయాన్ని పాకిస్థాన్‌ను అమెరికా అధ్యక్షుడు హెచ్చరించి ఉంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దుర్గంచెరువు డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దుర్గం చెరువు డ్రైనేజీ సమస్యను సర్వతేమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమీషనర్ జోనల్ కమీషనర్ జలమండలి, సిఈ, ఎస్.ఎన్.డి.పి ఈఈ, లేక్స్ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మురుగునీటి పైప్‌లైన్ సరిగా, క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. పైప్‌లైన్ మళ్లింపు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. సివరేజ్ లైన్ స్వతహాగా నిర్వహించి వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా జలమండలి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువును మరింత సుందరంగా పెంపొందించడానికి పార్కులో వస్తువులను సమీకరించాలని సి.ఎస్.ఆర్ నిర్వహిస్తున్న వారికి సూచించారు. అక్కడ ఉన్న ఎస్‌టిపి సందర్శించి శుద్ధి వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. థర్డ్ పార్టీతో పాటు నీరీ సంస్థ ద్వారా శుద్ధి చేసిన నీటిని పరీక్షించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఎస్.ఎన్.డి.పి ద్వారా చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలించి సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జోనల్ కమీషనర్ వారం వారం ప్రగతిని సమీక్షించి ఏవైనా అడ్డంకులు ఉంటే తొలగించి నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్‌ను ఆదేశించారు. కమీషనర్ వెంట శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ సహదేవ్ కేశవ్ పాటిల్, ఎస్ఎన్‌డిపి సిఈ కోటేశ్వరరావు, జలమండలి అధికారులు, లేక్స్ ఈఈ నారాయణ, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

చాణిక్యపురి జలమండలి సెక్షన్ ఆఫీసులో కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ గురువారం చాణిక్యపురి సెక్షన్ కార్యాలయానికి వెళ్లారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు మంచినీటి సరఫరా కలుషిత నీరు సరఫరాపై ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకుని రావడంతో చాణిక్యపురి సెక్షన్ కార్యాలయానికి కార్పొరేటర్ వెళ్లారు. ఆ సమయంలో డీజీఎం, మేనేజర్లు కూడా అందుబాటులో లేకపోవడం, హాజరు రిజిస్టర్ తనిఖీ చేయగా గత ఐదు నెలలుగా అధికారులు సంతకాలు లేకుండా ఉండడం గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యతారహితంగా పని చేయడం లేదని, ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు ఫోన్‌లో కూడా సమాధానం ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. వాటర్ లైన్‌మెన్ కూడా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, వీరందరిపైన జలమండలి ఎండికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బ్రహ్మయ్య, రత్న భూషణ్, రాము, రామక్రిష్ణ, కృష్ణవేణి, మౌసిన్, మోహిన్, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె గ్రాడ్యుయేషన్ డేలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అమెరికాలో తన కుమార్తె గ్రాడ్యుయేషన్ డేలో వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. తన కుటుంబ సమేతంగా కుమార్తె మేఘన గ్రాడ్యుయేషన్ డేకు హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ డే విజయవంతమైన సందర్భంగా మేఘన భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడమే కాక, తన కెరియర్‌లో రాణించనుందని రాజ్యలక్ష్మి ఆకాంక్షించారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మల్కాజిగిరిలో బి-బ్లాకు అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశం కోసం రాహుల్ గాంధీ అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజలే తన సర్వస్వమన్నారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత స్వార్థం ఏమీ వుండదన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, లక్ష్మి కాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, పిట్టల శ్రీనివాస్, యూసఫ్, ఆశ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మొయినాబాద్: మండలంలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. ఇలాంటి పుట్టినరోజులు రాహుల్ గాంధీ మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ కేజీ రెడ్డి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తత పేరుతో వాసాలమర్రిని ఆగం చేసిన కేసీఆర్

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వాసాలమర్రి గ్రామాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగమాగం చేస్తే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రిలో అర్హులైన 205 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంత్రి మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. నాడు గ్రామస్తులతో కేసీఆర్ సహపంక్తి భోజనం చేసి, ఆగవ్వ అనే వృద్ధురాలిని పక్కన కూర్చోబెట్టుకొని ఇల్లు కట్టిస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చలేదని ఇప్పుడు ఆగవ్వ మాటల్లోనే వింటుంటే ఎంతో బాధ కలిగిందన్నారు. ఆగవ్వ చెప్పినట్టు కేసీఆర్ చేసిన పచ్చి మోసం బట్టబయలు అయ్యిందని అన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి ఆగవ్వతో పాటు వాసాలమర్రి గ్రామస్తులందరూ ఆగమమయ్యారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వాసాలమర్రిని అన్ని విధాలుగా ఆదుకుంటూ అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేస్తుందన్నారు. వాసాలమర్రి లాగానే ఇండ్లు ఇస్తామంటూ బొమ్మను చూపి ఓట్లు వేయించుకున్న కేసీఆర్ ఏ ఒక్క ఊరికి ఇండ్లు ఇవ్వకుండా రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని 8 లక్షల కోట్లకు పైగా అప్పుల ఊబిలో ముంచితే ప్రభుత్వం అసలు, మిత్తి రూ.6500 కోట్లు ప్రతి నెలా చెల్లిస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్నివున్నా ఇచ్చిన హామీల మేరకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి ఇంటి గుమ్మానికి చేరుస్తుందని మంత్రి వెల్లడిరచారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టడానికి డబ్బులు కూడా లేవని ఆగవ్వ చెప్పడంతో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి వెంటనే లక్ష రూపాయలు అందజేశారు. తక్షణమే ముగ్గు పోసి పనులు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్ పర్సన్ బండ్రు శోభారాణి, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై పిల్లలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యజమాన్యం పిల్లల పట్ల ప్రత్యేక బాధ్యత, శ్రద్ధ చూపాలని హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రతపై పాఠశాల యాజమాన్యం అలాగే ఇతర శాఖలు నిర్వహించే బాధ్యతపై ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమిషనర్ సివి ఆనంద్‌తో పాటు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జాయింట్ కమిషనర్ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, కంటోన్మెంట్ బోర్డ్, సీఈఓ మధుకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్ మాట్లాడుతూ పిల్లలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ హైదరాబాద్ జిల్లాలో పటిష్ట చర్యలు చేపట్టటం జరిగిందని అన్నారు. పాఠశాల యాజమాన్యులు గడుతీరిన వాహనాలను నడిపితే అట్టి వాహనాలు సీజ్ చేయటంతో పాటు పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని సూచించారు. పాఠశాల యాజమాన్యాలు పాఠశాలల లోపల, ఆవరణ బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పాఠశాల సమయంలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అదేవిధంగా వాహనాలు నడిపే డ్రైవర్లు వాహనాల సేఫ్టీతో పాటు రోడ్డు నిబంధనలు పాటిస్తూ పిల్లలను క్షేమంగా చేర్చే విధంగా నిబద్ధతతో వాహనాలు నడపాలని ప్రతి వాహనంలో కూడా ఒక అటెండెంట్ ఉండే విధంగా చూడాలని అలాగే ప్రతి పాఠశాలలో కూడా సెక్యూరిటీ గార్డ్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాలలకు వెళ్లే ప్రాంతాల్లో ప్రమాద స్థలాలు, స్పీడ్ బ్రేకర్స్, వాహనాల స్పీడ్, తగ్గించి తీసుకువెళ్లటం శ్రేయస్కరమని సూచించారు. హైదరాబాద్‌లో ఫిట్నెస్ లేని వాహనాలను ఇప్పటికే సీజ్ చేయడం జరిగిందని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను దాదాపుగా 40 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పిల్లల సేఫ్టీ, వాహనాల సేఫ్టీ, బస్సు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం నిరంతరం ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బస్సులపై పాఠశాల, కళాశాల నిర్వాహకుల ఫోన్ నెంబర్లు తప్పక ఉండాలని అలాగే ప్రతి బస్సుపై కూడా అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్) అని తప్పక వ్రాయించాలని సూచించారు. ముఖ్యంగా మత్తు పదార్థాలు సేవించే వారిపై ఉక్కు పాదంతో అణిచివేస్తామని, పాఠశాల కళాశాలలకు వెళ్లే పిల్లలకు మత్తు పదార్థాలు అందించే వారిపై కూడా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ నిబంధనల మేరకు వాహనదారులు నడుచుకోవాలని సూచించారు. ట్రాన్స్పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేష్, స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య, ఈడి ఆర్టిసి రాజశేఖర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, డీఈవో రోహిణి, స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి

‘వీరీచ్’ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన వీహబ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం స్థాపించిన ప్రాముఖ్యమైన సంస్థ వీ హబ్ (వుమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్) మహిళల స్టార్టప్ ప్రయాణానికి దోహదపడే ప్రీ-ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్” వీరీచ్”ను గురువారం అధికారికంగా ప్రారంభించింది. ముఖ్య అతిథిగా హైదరాబాద్ కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ హరిచందన దాసరి కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ఉన్న వ్యాపార సామర్థ్యాన్ని వెలికితీయడం, ప్రోత్సహించడం లక్ష్యంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డిస్ట్రిక్ట్ బూట్ క్యాంప్‌ల ద్వారా ఎంపికైన 120 మంది మహిళా పారిశ్రామిక వేత్తలు రెండు బ్యాచ్‌లుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం, వ్యాపార ఆలోచన దశ నుంచీ వ్యాపారం స్థాపించే దశ వరకు సమగ్ర మద్దతు అందించేందుకు రూపొందించబడింది. ఇందులో బిజినెస్ నైపుణ్య శిక్షణ, ఆర్థిక డిజిటల్ లిటరసీ, మెంటార్ షిప్, ఎక్స్పోజర్ విజిట్‌లు మరియు ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌కు అవసరమైన సహకారాన్ని అందించడం వంటివి ఉన్నాయి. వీటివల్ల మహిళలు తమ స్వంత వ్యాపారాన్ని స్థాపించి దాన్ని స్థిరంగా అభివృద్ధి చేసుకునే అవకాశాలు పొందుతారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో మాట్లాడిన శహరిచందన దాసరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పారిశ్రామికవేత్తలను సాధికారత కలిగించడం సమగ్ర అభివృద్ధికి ఎంతో కీలకం. వీ రీచ్ వంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించడమే కాకుండా, సమాజంలో దీర్ఘకాలిక మార్పుని తీసుకురాగల సామర్థ్యం కలవు. వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల మాట్లాడుతూ ఈ మూడు నెలల ప్రోగ్రాంలో బిజినెస్ నైపుణ్యాలు పెంపొందించుకున్న మహిళలు అవసరమైన బిజినెస్ రిజిస్ట్రేషన్లు సమకూర్చుకొని తమ వ్యాపార యూనిట్లను లాంఛన ప్రాయంగా ప్రారంభించి ఆర్థిక ప్రతిపత్తి వైపు బాటలు వేస్తారని విహబ్ ఫౌండేషన్ సీఈఓ సీతపల్లచోల్ల తెలిపారు. మరిన్ని వివరాలకు info-wehub@ telangana.gov.in లేదా 09392184664 నంబరును సంప్రదించాలని, వీ హబ్ భారతదేశంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన మొట్టమొదటి ఇన్క్యుబేటర్, నోడల్ సంస్థ. ఇది పట్టణ, గ్రామీణ ప్రాంతాల మహిళలకు వ్యాపార అవకాశాలను అందించేందుకు సహాయపడుతుంది. వీ హబ్ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేస్తూ, మహిళా పారిశ్రామికవేత్తలకు మెంటార్షిప్, మార్కెట్ యాక్సెస్, ఆర్థిక నిధులు పొందేందుకు అనుకూల వాతావరణాన్ని అందిస్తోంది.

సుగుణమ్మ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మియాపూర్‌లో ప్రశాంత్‌నగర్ వారి నివాసంలో యంసిపిఐ (యు) పార్టీ రాష్ట్ర నాయకత్వంతో కలిసి ఆమెకు నివాళు లర్పించారు. తదనంతరం యంసిపిఐ (యు) జాతీయ కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ సుగుణమ్మ తన 15వ ఏటనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొంది. నాడు సాగిన దొరలు, భూస్వాములు, పెత్తందార్ల వెట్టిచాకిరికి వ్యతిరేకంగా బాంచన్ కాల్మొక్తా అనే సామాన్య ప్రజలచే ఆయుధం పట్టించి ఆత్మగౌరవ పోరాటం నిర్వహించి పది లక్షల ఎకరాల భూమిని పంచి, మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాల ఏర్పాటు చేసిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రధాన భూమిక పోషించిన నాయకత్వం రక్షణ కేంద్రం నిర్వహణ సభ్యురాలుగా ఉండి అనేక సాహస కార్యక్రమాలకు నేతృత్వం వహించిన సుగుణమ్మ కుటుంబం యావత్తు సాయుధ పోరాట వారసత్వం కావటం. ఆ పోరాటంలో అగ్రశ్రేణి పాత్ర నిర్వహిస్తూ ఉన్న కామ్రేడ్ శాఖమూరి వెంకట కృష్ణ ప్రసాద్ (యస్‌వికే ప్రసాద్)ని 1949లో పోరాట సందర్భంగానే వివాహం చేసుకున్న వీరు పోరాట విరమణ తరువాత ప్రజా ఉద్యమాల్లో కీలకమైన పాత్ర నిర్వహించారు. శాసనసభ ఎన్నికలలో చెన్నూరు నియోజకవర్గం నుంచి యస్‌వికే ప్రసాద్ గెలుపొందడం ఆనాటి ఉద్యమ నేతలను ప్రజలు అక్కున చేర్చుకున్న తీరు అమోఘం. ఇలా ప్రజా ఉద్యమాలలో సముచిత పాత్ర నిర్వహించిన సుగుణమ్మ జూన్ 16వ తేదీన రాత్రి మరణించటం పట్ల యంసిపిఐ (యు) ప్రధాన నాయకత్వం విప్లవ జోహార్లు అర్పించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణతో కలిసి నివాళులర్పించిన వారిలో యంసిపీఐ (యు) పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గదాగోని రవి, కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, పస్కుల మట్టయ్య, గోనె కుమార స్వామి, ఏ.హంసారెడ్డి, పెద్దాపురం రమేష్, తుకారం నాయక్, మంద రవి, కే సుకన్య, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్, తాండ్ర కళావతి, ఇస్లావత్ దశరథ్ నాయక్, పి.భాగ్యమ్మ, కర్ర దానయ్య, బి.విమల, శివాని ఉన్నారు.

ఐఆర్‌ఏ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన తోటకూర వజ్రేష్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగచెర్లలో ఐఆర్‌ఏ దయాగ్నస్టిక్ సెంటర్‌ను వజ్రేష్ యాదవ్ గురువారం ఉదయం కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ బోడుప్పల్ నగరం దినదినాభివృద్ధి చెందుతున్నందున ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ప్రజలకు సరైన పరీక్షలు నిర్వహించి ధరలు అందుబాటులో ఉండే విధంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, కొత్త కిషోర్ గౌడ్, కొత్త చందర్ గౌడ్, కర్రి శివశంకర్, మహేష్, కొత్త గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ప్రారంభమైన మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ‘ది కాస్కేడ్స్ నియోపోలిస్’

రూ. 3169 కోట్లతో 63 అంతస్తులతో 217 మీటర్ల ఎత్తైన నిర్మాణం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్‌బ్లాక్స్ రియాలిటీ ప్రమోటర్ల ఉమ్మడి భాగస్వామ్య సంస్థ అయిన జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా ఎల్ఎల్ పి, ఈరోజు “ది కాస్కేడ్స్ నియోపోలిస్” పేరిట రూ.3169 కోట్లతో లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తోన్నట్లు వెల్లడిరచింది. ఇది హైదరాబాద్‌లో విలాసవంతమైన జీవనాన్ని పునర్నిర్వచించ నుంది. దాదాపు 217 మీటర్ల ఎత్తుతో ఐదు 63 అంతస్తుల టవర్లు కలిగి ఉన్న ఈ ప్రాజెక్ట్, సమకాలీన డిజైన్, పర్యావరణ అనుకూల జీవనం, స్మార్ట్ హోమ్ ఆటోమేషన్‌ల అద్భుత సంగమంతో ప్రతిష్టాత్మక ల్యాండ్‌మార్క్‌గా మారనుంది. వ్యూహాత్మకంగా నియోపోలిస్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ 7.34 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. నివాసితులకు జీవన అనుభవాన్ని మెరుగుపరిచే రీతిలో భద్రతా సేవలు, ధృవపత్రాలు క్విన్టెసెన్షియల్లీ ద్వారా అంతర్జాతీయ భద్రతా సేవలు నివాసితులకు అపూర్వమైన ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన అనుభవాలను పొందేందుకు అనువుగా వివేకవంతమైన రీతిలో వ్యక్తిగతీకరించిన జీవనశైలి నిర్వహణ సేవలను అందించడం దీని లక్ష్యమని జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా ఎల్ఎల్‌పి భాగస్వామి కార్తీష్ రెడ్డి అన్నారు. ఆయనే మాట్లాడుతూ “వీటితో పాటు, ది కాస్కేడ్స్ నియోపోలిస్ అనేది ల్యాండ్‌స్కేప్డ్ గార్డెన్స్ నుండి వెల్‌నెస్ జోన్‌ల వరకు సమగ్ర వెల్‌నెస్‌పై దృష్టి సారించడం ద్వారా విలాసవంతమైన జీవనానికి మించి ముందుకు సాగడానికి రూపొందించబడిరది. ఇది అపార్ట్మెంట్ నివాసితులు కేవలం నివసించటానికి మాత్రమే కాకుండా అభివృద్ధి చెందడానికి సహాయపడే జీవన అనుభవాన్ని అందించడం గురించి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు లక్ష్మీ నారాయణ, శరత్‌లు పాల్గొన్నారు.

ఈనెల 30న రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల సదస్సు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జూన్ 30న, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ హైదరాబాద్‌లో సమగ్ర సాంస్కృతిక విధానం ప్రకటించాలని రాష్ట్రస్థాయి కళాకారుల సదస్సు జరుగుతున్నది పల్లె నర్సింహ తెలిపారు. గురువారం ప్రజానాట్యమండలి కార్యాలయం హిమాయత్ నగర్ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రా సమితి ఆఫీస్ బేరర్స్ సమావేశం లో పల్లె నర్సింహ మాట్లాడుతూ ఈ సదస్సులో కవులు కళాకారులు ఎదురుకొంటున్న సమస్యలు, కళాకారులకు గుర్తిపు, హెల్త్ కార్డులు, ఉద్యమ కళాకారులకు సారధిలో ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత, పిల్లల చదువులకు, ప్రయాణాల్లో రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కళాకారుల కోట, క్రీడాకారుల మాదిరిగా కళాకారులకు సముచిత స్థానం కల్పించాలని, సదస్సులో పాల్గొన్న వారి అభిప్రాయాలను తీసుకొని తెలంగాణ ప్రజానాట్యమండలి సంఘం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కరంకు సదస్సు ఉపయోగపడుతుంది అని పల్లె నర్సింహా అన్నారు. కావున కవులు, కళాకారులు, సదస్సులో పాల్గొనాలని విజయవంతం చేయాలనీ పల్లె నర్సింహా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షులు, కే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి కే ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు అరెల్లి రవి పాల్గొన్నారు.

పాలస్తీనా, ఇరాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం నశించాలి

వామపక్ష ప్రజాస్వామ్య ప్రజాతంత్ర పార్టీల, సమూహాల డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిపిఐ, సిపిఐ (ఎం), సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ఎం సి పి ఐ(సి) ఆర్.ఎస్.పి ఫార్వర్డ్ బ్లాక్ సిపిఐ ఎంఎల్, ఆధ్వర్యంలో అమెరికా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం నశించాలని, అమెరికా కాన్సులేట్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించటానికి వెళ్లిన వామపక్ష పార్టీల నాయకులను కార్యకర్తలను పోలీస్ ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నార్సింగ్, గచ్చిబోలి పోలీస్ స్టేషన్లకు తరలించారు. సామ్రాజ్యవాద అమెరికా వత్తాసుతో ఇజ్రాయిల్ పాలస్తీనా, గాజాలో హమాస్‌పై యుద్ధానికి పాల్పడి 60000 మందికి పైగా హతమార్చిన దుర్మార్గాన్ని ఖండించమని యుద్ధాన్ని ఆపాలని పాలస్తీనా ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యం సార్వభౌమత్వాన్ని పరిరక్షించాలి అని పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా వామపక్ష పార్టీలు జాతీయస్థాయిలో జనవరి 17వ తారీఖున పాటించటం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో 19వ తారీఖున అమెరికా కాన్సులేట్ ఆఫీసు ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికా వత్తాసుతో ఇరాన్‌పై ముఖ్యంగా మిలటరీ స్థావరాలపై క్షిపణులతో దాడులకు పాల్పడింది. ఇరాన్ దేశంలోని ఇంటెలిజెన్స్‌ను హత మార్చటానికి పూనుకుంది. ఇరాన్ అణ్వాయుధ దేశంగా మారటానికి వీల్లేదని అమెరికా పెత్తనం కింద కొనసాగాలని ఇరాన్ దేశంపై యుద్ధాన్ని ప్రేరేపించి కొనసాగిస్తున్నారు. అమెరికా ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం పోరాడుదాం అని వామపక్ష పార్టీల నాయకులు నార్సింగ్ పోలీస్‌స్టేషన్లో జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల నాయకులు పశ్య పద్మ, ఈటి నరసింహ, పాలమాకుల జంగయ్య, జాన్ వెస్లీ, హన్మేష్, వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్, సంధ్య, అనురాధ, మురహరి, ప్రసాద్, సుహాస్, ఎస్ వెంకటేశ్వరరావు, కెఎస్ ప్రదీప్, నేదునూరి జ్యోతి, కే కాంతయ్య, ఛాయాదేవి, స్టాలిన్, ప్రభు లింగం, డీజే నరేంద్ర ప్రసాద్, వజ్రాల అరుణ, బాసపల్లి, భార్గవి తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పశ్యపద్మ, పాలమాకుల జంగయ్య, జాన్వెస్లీ, హన్మేష్, వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్, సంధ్య దాదాపు వంద మంది అరెస్ట్ అయ్యారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

కార్మికులతో కలిసి కేక్ కట్ చేసిన ఉప ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా కూడా కేక్‌లు కట్ చేయడం, అన్నదానాలు, రక్తదాన శిబిరాలతో పాటు వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా నగరంలోని మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సందర్భంగా ఖైరతాబాద్ జోన్‌కు చెందిన జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ సీనియర్ నాయకుడు డాక్టర్ పి, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన కేక్ ను పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కట్ చేయడం విశేషం. అనంతరం కేక్‌ను పారిశుద్ధ్య కార్మికులు మంజుల, కళావతిలకు స్వయంగా తినిపించారు. వారు కూడా ఉప ముఖ్యమంత్రికి కేక్‌ను అందించారు. కేక్ కటింగ్ అనంతరం కార్మికులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహపంక్తి భోజనాలు చేశారు. భోజనాలు చేసిన తరువాత కార్మికులంతా రాహుల్ గాంధీకి ఆశీర్వాదాలు తెలిపారు. నానమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీలా దేశానికి ప్రధానిగా సేవలు అందించాలన్నారు.

గాంధీభవన్‌లో రాహుల్ జన్మదిన వేడుకలు...

అదేవిధంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను

పురస్కరించుకుని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లు విచ్చేసి కేక్ కట్ చేశారు. అయనతో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వారు మాట్లాడుతూ రాబోయే తరానికి రాహుల్ గాంధీ దిక్చుచి అని వ్యాఖ్యానించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కులగణనకు ఒప్పుకుంది అంటే అది రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే అని వ్యాఖ్యానించారు. రాహుల్ ఒత్తిడి వల్లనే కేంద్రం కులగణన కు గెజిట్ విడుదల చేసిందని అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కులగణన చేసిందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని అకాంక్షించారు. దేశ ప్రజల కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని, కాంగ్రెస్ లో మాత్రమే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని వారు ఈ సందర్భంగా అన్నారు. బలహీన వర్గాలకు చెందిన మంత్రిగా పొన్నం ప్రభాకర్, దళిత మంత్రిగా తాను, పీసీసి అధ్యక్షుడుగా మహేష్ కుమార్ గౌడ్ లు దానికి నిదర్శనం అంటూ మంత్రి లక్ష్మణ్ అన్నారు. నిన్నటి వరకు సామాన్య కార్యకర్త, ఎమ్మెల్యేగా ఉన్న నేను సోషల్ జస్టిస్‌లో భాగంగా దళిత వర్గం నుండి మంత్రిని అయ్యానని చెప్పుకొచ్చారు. ఒక మంత్రిగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలకు హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు, మన ప్రియతమ నేత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పుట్టినరోజు వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ అభివృద్ధి కొరకు సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం రాసమల్లె గూడెం, నాగులపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.45 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చౌకధర దుకాణం, రూ.5 లక్షలతో డ్రైనేజీ పనులు, నాగులపల్లిలో రూ. 35 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గతంలో రేషన్ దుకాణం నాగులపల్లిలో ఉండడం వల్ల ఈ గ్రామస్తులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొనే వారని దాదాపు 200 కుటుంబాలు రేషన్ సామాన్ల కోసం కాలిబాటన నడిచి మూసుకోచ్చే వారని గుర్తు చేశారు. గ్రామస్తులు ఈ సమస్యను తన దృష్టికి తేవడంతో రేషన్ షాపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా సిసి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నామని భవిష్యత్తులో ప్రజలకు ఏ అవసరం ఉన్న గ్రామాలకు పెద్దపీట వేస్తామని గ్రామీణుల యోగక్షేమాలను గుర్తిస్తామని ఎమ్మెల్యే శంకర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివ రాములు, కరంగుల రాజేష్ రెడ్డి, దనుగుల వెంకటయ్య, చెచిల రాఘవేందర్, ప్రవీణ్, పల్లపు రవి, మెరుగు రవీందర్, ధనుగుల శ్రీను, దానుగుల నరేందర్, గజ్జి వెంకటేష్, చౌల దర్శన్ పాల్గొన్నారు.

మల్లయ్యచారికి సిపిఎం నాయకుల నివాళులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కామ్రేడ్ మల్లయ్య చారి భౌతిక్కాయానికి సిపిఎం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డి.జి. నరసింహారావు, ఎర్ర జండా కప్పి, పూలమాల వేసి, జోహార్లు అర్పించారు. ఆయనతో పాటు మల్కాజిగిరి పార్టీ సీనియర్ నాయకులు కృపా సాగర్, పాపిరెడ్డి, బాబు, సింహం, విజయకుమార్‌లు మల్లయ్యచారి మృతదేహానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి.జి.నరసింహారావు ప్రసంగిస్తూ మల్లయ్య చారి సికింద్రాబాద్‌లోని కంచర బజార్‌లో నివాసముంటూ, బిందెలు తయారు చేస్తూ వాటిని అమ్మగా వచ్చిన ఆదాయంతో జీవనం సాగించే వారు. ఈయన అతి పేద కుటుంబంలో పుట్టిన వ్యక్తి అని, మంచి సౌమ్యుడు, నిరాడబరుడు, సహాయ కారిగా మంచి పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి అని, 969 ప్రత్యేక తెలంగాణ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ ప్రజా సమితిలో చేరి చురుకైన పాత్ర పోషించారు. పోలీస్ నిర్బంధాన్ని గట్టిగా ఎదుర్కొన్న ధైర్యశాలి. గురువారం అనారోగ్యం కారణంగా మల్లయ్య చనిపోయారని ఆయన తెలిపారు. వీరికి భార్య, 4 గురు కుమారులున్నారు. మల్లయ్య చనిపోయే వరకు కమ్యూనిస్ట్‌గా జీవించాలని ఆయన ప్రగాఢమైన కోరిక. అలానే జీవించాడని, మల్లయ్యకీ నివాళు లర్పిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. నారాయణరెడ్డి, సూర్య కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె యేసు రత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా జిల్లా 2వ మహాసభల సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కే యేసు రత్నం జెండా ఆవిష్కరించారు. ఈసీఎల్ సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం గాలం లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారలోకి వచ్చిన తరువాత దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. రాజ్యాంగన్ని రద్దు చేసి మణుధర్మ శాస్త్రన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రయివేట్‌రంగంలో రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి పథకాన్ని రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కే యేసురత్నం మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ అధికారలోకి వచ్చి 18 నెలలు అవుతున్న చేవెళ్ల డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాల విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలు జులై 7, 8 తేదీల్లో పి ఆర్ ఆర్ ఏ సి కన్వెన్షన్, హంటర్ రోడ్ వరంగల్‌లో జరగనున్నాయి. కే సాదేవ్, వై ఉషాశ్రీ, నర్సింగరావు, సాయిలు, బొట్టు రమేష్, మహేష్, సదానందం, రజిని, కోమల పాల్గొన్నారు.

ఐదు నెలలుగా రిజిస్టర్‌లో సంతకాలెక్కడ...



విశాలాంధ్ర, మల్కాజిగిరి : చాణిక్యపురి జలమండలి సెక్షన్ కార్యాలయంలో అధికారులు విధులకు హాజరవుతున్నారా లేరా అనే సందేహం వ్యక్తం అవుతుంది. మల్కాజిగిరి డివిజన్ పరిధిలో గల జలమండలి సెక్షన్ కార్యాలయంలో సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. గత ఐదు నెలలుగా రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవ డాన్ని చూసి ఆయన ఆశ్చర్యానికి లోనయ్యారు. అయితే బయోమెట్రిక్ యంత్రాలు కూడా పని చేయకపోవడం రిజిస్టర్‌లో సంతకాలు చేయక పోవడం చూసి ఆయన అధికారుల తీరు ఏ విధంగా ఉందో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిపై జలమండలి ఉన్నతాధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేపట్టి అధికారుల పని తీరును పరిశీలించాల్సి ఉండగా, ఎవరు కూడా పరిశీలిం చకపోవడంతో అధికారులు కార్యాలయాలకు వస్తున్నారా లేదా కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో కలుషిత నీరు మంజీర నీటిలో వస్తున్నప్పటికీ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోకపోవడం, లైన్మెన్ కు ఫిర్యాదు చేసిన తమకేం తెరవదంటూ దాటవేసే ధోరణితో వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ప్రతినెల వేతనాలు ఏ ఆధారంతో ఇస్తున్నారో ఉన్నతాధికారులు తెలిపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చిన సమయంలోనైనా బయోమెట్రిక్ యంత్రం పని చేయకపోతే రిజిస్టర్ లో అయినా సంతకాలు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ పని చేస్తున్నటువంటి డిజిఎం ప్రజలకు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంటుందని ఆమె ప్రజలు దరఖాస్తు చేసుకున్నటువంటి దరఖాస్తులను పరిశీలించకపోవ డమే కాక ఆ ధరకాస్తునకు కొర్రీలు మీద కొర్రీలు పెడుతూ నానా ఇబ్బందుల గురి చేస్తున్నటువంటి పరిస్థితి ఏళ్ల తరబడి కొనసాగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరేతిన్నట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేతాని ప్రశ్నించారు. ప్రజలకు అందాల్సిన కనెక్షన్లు అందకపోవడం ఈమే వ్యవహార శైలిపై జలమండలి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇక్కడ డీజీఎం తీరుపై తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డివి చౌకబారు వ్యాఖ్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బనకచర్ల ప్రాజెక్ట్‌పై, గోదావరి నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంపై, మీడియా సమావేశంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఉద్దేశించి రేవంత్ రెడ్డి చేసిన చౌకబారు వ్యాఖ్యలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి ఖండించారు. గోదావరిపై తెలంగాణ ప్రయోజనాలు దెబ్బ తీసేలా ఆంధ్రా ప్రభుత్వం కుట్రపూరితంగా కడుతున్న బనకచర్ల ప్రాజెక్ట్‌కుపై నిన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సమావేశం ప్రజలకేదో నిజానిజాలు తెలియజేయడానికి, ఆంధ్రా ప్రభుత్వ కుట్రలు బట్టబయలు చెయ్యడానికి పెట్టినట్టుగా లేదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న ఉత్తం కుమార్ రెడ్డి అలాగే మిగతా మంత్రివర్గం అంతా నీళ్ళ ప్రాజెక్ట్‌లపై, ఏది ఎక్కడుంది, దేనివల్ల ఎక్కడ నష్టం జరుగుతుందో తెలుసుకోవడానికి అధికారులతో శిక్షణా తరగతులు నిర్వహించినట్టుందని ఎద్దేవ చేశారు. ఒక బాధ్యతగల ముఖ్యమంత్రి పదవిలో ఉండి, మాజీ ముఖ్యమంత్రిని, ఈ తెలంగాణ రావడానికి కారకులైన ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ని, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్ రావుని ఉరి తీయాలని అనడం చూస్తుంటే నీ బాధంతా సాగునీటి ప్రాజెక్టు లపై ప్రజలకు నిజా నిజాలు చెప్పడం కంటే ఎక్కువ తెల్లారి పేపర్‌లో మొదటి పేజీలో పెద్ద పెద్ద అక్షరాలతో నీ వార్త ఉండాలన్న ఆరాటమే ఎక్కువగా కనిపిస్తుందన్నారు. అతిత్వరలో రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలే దూలానికి పగ్గం కట్టి కుతికెకు తాడుకట్టి మంచినీళ్ళు కూడా అడగకుండా ఉరి తీసే రోజులు అతి దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

వీధి లైట్ల సమస్య పరిష్కారంపై దృష్టి సారించండి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్ట్రీట్ లైట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం అడిషనల్, జోనల్ కమిషనర్‌లు, హెచ్.ఓ.డిలతో డి-సిల్టింగ్, శానిటేషన్, స్ట్రీట్ లైట్, దోమల నివారణ, టాక్స్ వసూళ్లపై కమీషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ సమస్యలపై తరచుగా ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ విషయంలో కార్పొరేటర్లు, ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు గల కారణాలను తెలుసుకుని పరిష్కారం చేయాలని జోనల్ కమిషనర్‌లను ఆదేశించారు. మెన్, మెటీరియల్ ఏర్పాటుకు జోనల్ కమిషనర్లకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జోనల్, డిప్యూటీ కమిషనర్లు, విద్యుత్ ఇంజనీర్లు, ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తాను కూడా పర్యటిస్తానని అన్నారు. వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పై చర్యలు తీసుకోవాలని డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమలు నివారణకు ఫాగింగ్ చర్యలు కొనసాగించాలని ఏ.ఎల్.ఓ ల ద్వారా ఐ.ఈ.సి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని, అందుకు పాఠశాల, కాలేజీలలో చదివే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో, పాఠశాలలో శానిటేషన్ తో పాటు డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కమీషనర్ హెల్త్‌ను ఆదేశించారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, ఖాళీ స్థలం పై నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో తిరిగి విజిలెన్స్ బృందాలు కూడా పరిశీలన చేస్తారని అన్నారు. డి-సిల్టింగ్ ఆశించిన ప్రగతి లేనందున హైడ్రా సమన్వయంతో పరిశీలించి ప్రగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌లను ఆదేశించారు.

సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : జలమండలి విభాగంలో మాదాపూర్ డివిజన్ నరల్ మేనేజర్లు కృష్ణ, హఫీజ్పెట్ డివిజన్ నరల్ మేనేజర్లు శ్రీనివాస్ రెడ్డి, కూకట్పల్లి డివిజన్ నరల్ మేనేజర్లు హరి కృష్ణ నూతనంగా నియమితులైన శుభసందర్భంగా వివేకానందనగర్‌లోని పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్యాలయంలో గాంధీని మర్యాద పూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన జలమండలి జనరల్ మేనేజర్లకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, కొత్త బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో ఉండాలని, క్షేత్ర స్థాయిలో ఉంటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, ప్రజలకు మంచి పనులు చేస్తూ గుర్తింపు పొందాలని తెలియచేసారు. జీహెచ్ఎంసీ, జలమండలి ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేయాలని, ప్రజలకు ఎల్లవేళలలో అందుబాటులో ఉండలని, విడాలని, మీ దృష్టికి ప్రజల నుండి వచ్చిన ప్రజా సమస్యలపై స్పందించే అవసరం ఎంతైనా ఉంది అని, అదేవిధంగా జీహెచ్ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్లాలని, పనుల స్థితిగతి, పనుల పురోగతి, కొత్త ప్రతిపాదనలు మంజూరైన పనులు మరియు శంకుస్థాపనకు సిద్ధమైనవి వాటి సమగ్ర సమాచారంపై సమీక్షించడం జరిగినది అని తెలియచేసారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మంచి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగునీరు ను అందించేలా చూడలని, సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించేలా చూడలని, నిరంతరం మంచి నీటిని అందించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని గాంధీ అధికారులకు తెలియచేసారు.

దేశానికి దిక్సూచిగా నిలిచిన రాహుల్ గాంధీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కే చెన్నయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై కేక్ కట్ చేసి ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు రాహుల్ గాంధీ వేలాది కిలోమీటర్లు భారత్ జోడోయాత్ర చేపట్టారని దేశానికి ఒక దిక్సూచిగా నిలిచారని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. భవిష్యత్తులో భారతదేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ లాంటి వారు ఎంతో అవసరమని దీనిని ప్రజలు గుర్తించాలన్నారు. భారత్ జూడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పట్టణంలో ఒకరోజు బస చేయడం ఆయన రావడం కార్యకర్తలకు ఎంతో పండగ లాంటిదని ఇది తమకు స్వాతంత్ర సమరం లాంటిదని ఆరోజును ఎమ్మెల్యే శంకర్ జ్ఞాపకం చేసుకున్నారు. రాహుల్ గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలను చేసి ఈ దేశాన్ని కాపాడుకుంటుందని త్యాగాల మయమైన ఈ కుటుంబాన్ని ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. దేశ ప్రజలు బలంగా కోరుకుంటున్నారని రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయం అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్ కృష్ణారెడ్డి, వెంకట్ రామిరెడ్డి, రఘునాయక్, బాలరాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, విశ్వం, జమ్రుద్ ఖాన్, బస్వము, ఇబ్రహీం, హర్ష, దంగు శ్రీనివాస్ యాదవ్, అందే మోహన్, పురుషోత్తంరెడ్డి, మురళి మోహన్, కొమ్ము కృష్ణ, ముబారక్, ఖదీర్, బాధేపల్లి సిద్దార్థ, జాంగారి రవి, మసూద్ ఖాన్, ఖాదర్ ఘోరీ, కరుణాకర్, మహబూబ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన అంకురా హాస్పిటల్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అంకురా హాస్పిటల్, బంజారాహిల్స్, న్యూరో గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్యంలో ఒక ప్రధాన మైలురాయిగా నిలిచే విధంగా, స్పైన బిఫిడా వంటి జన్మతః నర సంబంధిత సమస్యతో జన్మించిన 32 ఏళ్ల మహిళకు అత్యాధునిక, మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ఈ సమస్య వలన ఆమె జన్మతఃనే తీవ్రమైన పేగు మూత్ర సంబంధిత లోపాలతో బాధపడుతోంది. ఈ మహిళ ఒక పూర్తి సమయ ఉద్యోగిగా ఉండగా, గతంలో చేసిన అన్‌టిగ్రేడ్ కాంటినెన్స్ ఎనీమా అనే శస్త్రచికిత్స విఫలమవడంతో, పేగు శుభ్రత కోసం ఆమె తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వచ్చేది. దీన్ని అధిగమించేందుకు, ఆమె అంకురా హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్ యూరాలజీ విభాగం చీఫ్ సర్జన్ డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరంని సంప్రదించారు. వివరమైన మూల్యాంకనం అనంతరం, డాక్టర్లు భారత్‌లో తొలిసారి అమలు చేస్తున్న ఒక వినూత్న, మినిమల్ ఇన్వేసివ్ విధానాన్ని సిఫార్సు చేశారు. ఇ పద్ధతిలో సంపూర్ణ శస్త్రచికిత్స అవసరం లేకుండా, కేవలం కోలోనోస్కోపిక్ మార్గంలో సీకమ్ (మూత్రాశయానికి సమీపంలోని పెద్దపేగు భాగం) (పెర్క్యూటేనియస్ ఎండోస్కోపిక్ గాస్ట్రోస్టోమీ) ట్యూబ్‌ను అమర్చడం జరిగింది.

ఈ కోలోనోస్కోపిక్ సీకోస్టోమీ పద్ధతి సాంకేతికంగా క్లిష్టమైనది, ఆమెకు గతంలో జరిగిన శస్త్రచికిత్సల వల్ల ఏర్పడిన సంధానాల కారణంగా ఇది మరింత కష్టతరమైంది, అని ఈ శస్త్రచికిత్సను నిర్వహించిన అంకురా హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ - పీడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు హెపటోలాజిస్టు డా. పరిజాత్ రామ్ త్రిపాఠి వివరించారు.

చింతలకుంట వద్ద మురుగునీరు సమస్య తీర్చాలి



విశాలాంధ్ర - తుర్కయంజాల్ : చింతలకుంట ఆయిల్ మిల్లు మెయిన్ రోడ్డు వద్ద వర్షం వచ్చిన ప్పుడు నీళ్లుఆగి ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని కాలనీ వాసులకు స్థానికంగా నివాసం ఉన్నటువంటి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ సరూర్నగర్ మండల కార్యదర్శి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ అధికారులను కోరారు. సీజన్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో జిహెచ్ఎంసి అధికారులు అప్రమత్తంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎప్పటికప్పుడు మురికినీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని డెంగ్యూ మలేరియా అంటూ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు శుభ్రత పాటించే విధంగా చూడాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చింతలకుంట శాఖ 16వ మహాసభ చింతలకుంటలో జరిగినది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిపిఐ సరూర్నగర్ మండల కార్యదర్శి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ హాజరయ్యారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా బి లింగయ్య గౌడ్‌ని కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా ఎం.వెంకటయ్యలని ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఐ సరూర్నగర్ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములు గౌడ్, శోభ, నరసింహ వినోద్ 11 మందితో కమిటీ ఎన్నుకోవడం జరిగినది.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

విశాలాంధ్ర -మొయినాబాద్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి అన్నారు. పాలస్తీనా, ఇరాన్లపై సామ్రాజ్య వాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న అమానుష దాడులను నిలిపివేయాలని లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్ గౌలిదొడ్డిలోని అమెరికన్ కన్సల్టెంట్ వద్ద నిరసన ప్రదర్శన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి నాయకుడు కె.బిరామస్వామి, లెఫ్ట్ పార్టీల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి హైదరాబాదులోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించడం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులను సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను అందరిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సంకల్ప సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర- దుండిగల్: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన సికింద్రాబాద్ సిక్ విలేజ్ ఇంపీరియల్ గార్డెన్ నందు జూన్ 22వ తేదిన నిర్వహించే సంకల్ప సభ కరపత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సమక్షంలో వికసిత్ భారత్ సంకల్ప సభ, ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగిందని, కావున కుల మత ప్రాంతాలకు అతీతంగా ఈ కార్యక్రమానికి విచ్చేసి నరేంద్ర మోడీ పాలన సాధించిన ఎన్నో గొప్ప విజయాలు తెలంగాణ ప్రజనీకానికి తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్వర్, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యామ్ రావ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి భానుగౌడ్ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, ఆకుల మల్లేష్, నర్సింహా చారీ, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ క్షమాపణ చెప్పాలి

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై చర్యలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర -విజయవాడ: భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ముగిసిన వారాలు గడుస్తున్నా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దేశ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. ట్రంప్ వ్యాఖ్యలపై దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ తక్షణమే క్షమాపణలు చెప్పాలని, వెంటనే పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి ఈ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఏర్పాటును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు అఖిలపక్ష సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ చిన్న దేశాలు సైతం ట్రంప్‌ను వ్యతిరేకిస్తుంటే 146 కోట్ల జనాభా గల భారతదేశ ప్రధాని మోదీ, రక్షణశాఖ మంత్రి, బీజేపీ నాయకులు అమెరికా అధినేత ట్రంప్ వ్యాఖ్యలకు దీటుగా స్పందించే పరిస్థితి లేకపోవడం సిగ్గుచేటన్నారు. వ్యాపార, వాణిజ్య సంబంధాలు నిలిపివేస్తామని బెదిరించడంతో భారత్-పాక్ యుద్ధం ఆపివేశాయని ట్రంప్ పదేపదే చెబుతుంటే మోదీ నోరుమెదపడం లేదన్నారు. జి-7 సమావేశంలో అనేక అంశాలపై చర్చించుకున్నామని మోదీ గొప్పలు చెప్పడం కాదని, ట్రంప్ వ్యాఖ్యలపై దేశ ప్రజలకు మోదీ తక్షణమే క్షమాపణ చెప్పాలని, వెంటనే పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేసి ఈ అంశాలపై చర్చించాలన్నారు.

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు పరాకాష్టకు చేరాయని రామకృష్ణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిబంధనలు పాటించడం లేదని, కనీసం ప్రభుత్వమంటే లెక్కేలేదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు తమ జేబుల్లో ఉన్నారన్నట్లుగా కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్ల తీరు ఉందని అన్నారు. ప్రభుత్వ జీవోలు, నిబంధనలు పట్టించుకోకుండా ప్రజల నుంచి ఇష్టమొచ్చినట్లు ఫీజులు వసూలుచేసి... 6 నెలలకు లేదా కోర్సు పూర్తి చేసిన తరువాత అడ్డగోలుగా ఫీజులు పెంచేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. రాజ్యాంగం తమదే, మేమే రాజులం అన్నట్లు కార్పొరేట్ విద్యాసంస్థల వ్యవహార శైలి ఉందన్నారు. పుస్తకాలు అమ్మకూడదనే నిబంధనలు ఉన్నా యథేచ్ఛగా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, పక్కాగా ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. దీనిపై ఏఐఎస్ఎఫ్ నేతలు కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే పోలీసులతో దాడులు చేయించడం దుర్మార్గమన్నారు. పోలీసులకు పనేమీ లేనట్లు సమస్య రాక ముందే చేరుకుని యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తామని గొప్పలు చెప్పడం కాకుండా... దోపిడీ వ్యవస్థలను కట్టడి చేసేందుకు తెచ్చిన జీవోలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టాలు కోరుకోవడం లేదని, ఉన్న చట్టాలు అమలు చేయకపోతే ప్రభుత్వం ఉన్నట్లా, లేనట్లా అని ప్రశ్నించారు. జీవోలు సక్రమంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.

బనకచర్లపై ఏకపక్ష నిర్ణయం సరికాదు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని దిల్లీలో ఒత్తిడి తీసుకురావడంతోపాటు న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు ముందుకు వెళ్లాలనే నిర్ణయం కేవలం అక్కడి ప్రజల నుంచి మార్కులు కొట్టేయడానికేనని విమర్శించారు. మరొక అడుగు ముందుకేసి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఏకంగా దిల్లీకి వెళ్లి బనకచర్ల ప్రాజెక్టు నిలిపివేయాలని కోరుతూ... రెండు రాష్ట్రాలకు న్యాయం చేయాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కోరారన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌కు అనుగుణంగా టీఆర్ఎస్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ప్రచారం చేసుకుంటుందన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు పెద్దఎత్తున తెలంగాణలో ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. గోదావరి నుంచి యేటా 3 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతున్నదని నీటిపారుదల రంగ నిపుణులు స్పష్టంగా చెబుతున్నారని, ఈ విషయం రెండు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కూడా తెలుసన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రోజుకు 200 టీఎంసీలు తీసుకున్నా ఇంకా 2700 టీఎంసీలు మిగులుతోందన్నారు. ఇంత తెలిసినా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, హరీశ్‌రావు ఈ ప్రాజెక్టుకు అడ్డుతగలడం మంచిది కాదన్నారు. దీనిపై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి కేసీఆర్‌తో సన్నిహితంగా ఉంటూ... ఆంధ్రలోని ప్రతిపక్ష నాయకులతో మాట్లాడదానికి ముందుకొచ్చేవాడు కాదన్నారు. ఎంతో రాజకీయ అనుభవం గల చంద్రబాబు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు ఉపయోగకరంగా ఉంటుందని రూ.82 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించామని చెబుతున్నారని, ఇంత ప్రాముఖ్యత గల ప్రాజెక్టు గురించి రాష్ట్రంలోని అన్ని పార్టీలతో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. రూ.82 వేల కోట్లు కాస్తా ప్రాజెక్టు పూర్తిచేసే నాటికి దాదాపుగా రూ.2 లక్షల కోట్లకు చేరుతుందని, ఇంత భారీ వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు గురించి ఎవరికీ చెప్పకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టుపై చర్చించడానికి అఖిలపక్ష నాయకులతో పాటు నిపుణులు, రైతుసంఘ నాయకులతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీ లాసెట్‌లో అమ్మాయిలే టాప్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ లాసెట్, పీజీ లాసెట్ ఫలితాలు వచ్చాయి. 95 శాతం మంది అర్హత సాధించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా లాసెట్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. మొత్తం 27,253 మంది దరఖాస్తు చేసుకోగా, 20,826 మంది అర్హత సాధించారు. లాసెట్ (మూడేళ్లు, లాసెట్ (ఐదేళ్ల)లో మొదటి ర్యాంకులను అమ్మాయిలు కైవసం చేసుకున్నారు. లాసెట్ (మూడేళ్లు)లో వేముల వెంకట శివసాయి భార్గవి, పీజీఎల్‌సెట్ బైసవి హరీతశ్రీ, లాసెట్ (ఐదేళ్ల)లో పల్లపు గ్రీష్మ మొదటి ర్యాంకు సాధించారు. లాసెట్ (మూడేళ్లు) టాప్ 10 ర్యాంకులు సాధించిన వారిలో వేముల వెంకట శివసాయి భార్గవి (అనకాపల్లి), ముదునూరి రామ్‌తేజ్ వర్మ (విశాఖ), పల్నాటి సత్యాంజనదేవి (ఏలూరు), వి.రమేశ్ (అన్నమయ్య), బొప్పన శరత్ చంద్ర (కృష్ణా), దాసరి మాధవరావు(పల్నాడు), డీవీ సూర్య సత్య మహేంద్ర (తూర్పుగోదావరి), ఎం.మల్లికేశ్వరపు డి.సాయికృష్ణ(ఎన్టీఆర్), కిరణ్‌కుమార్ సింగంశెట్టి (విజయనగరం), పాతూరి హరీశ్ (ఎన్టీఆర్) ఉన్నారు. పీజీఎల్‌సెట్ టాప్ 10 ర్యాంకర్లుగా బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన బైసవి హరీతశ్రీ, యనమల లోకేశ్వరి (వైఎస్ఆర్ కడప), కొర్సపాటి ప్రశాంత్ (ఒంగోలు), శ్రావ్య గొర్లి (విశాఖ), రమీజ్ రాజా షేక్ (విశాఖ), ఎం.విజయ మణికంఠ (శ్రీకాకుళం), సీహెచ్ ధ్యానేష్ నాయుడు (విజయనగరం), నిమ్మకూరి రామకృష్ణ (గుంటూరు), బొడ్డు శ్రీరామ్(హైదరాబాద్), ఆర్.దుర్గాప్రవీణ్ (రాజమహేంద్రవరం) ఉన్నారు. లాసెట్ (ఐదేళ్ల)లో టాప్ 10 ర్యాంకర్లుగా పల్లపు గ్రీష్మ (అన్నమయ్య), సింగమల భావన (తిరుపతి), బత్తుల సూర్యతేజ (పల్నాడు), నక్కా ఉదయచంద్ర (విజయనగరం), మరుపల్లి రమేశ్ (విశాఖ), యు.వెంకట రమణ (అన్నమయ్య), ఎలుగూరి లహరి (విజయవాడ), సయ్యద్ అప్సానా జబాన్ (కర్నూలు), ఆళ్ల యశశ్వి (గుంటూరు), మహమ్మద్ ఇంతియాజ్ (విజయవాడ) ఉన్నారు.

పోలింగ్ ప్రశాంతం

5 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు

న్యూదిల్లీ: దేశంలోని నాలుగు రాష్ట్రాల్లోగల ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం ఉప ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ సాగింది. పశ్చిమ బెంగాల్‌లోని కాళీగంజ్, కేరళలోని నీలాంబుర్, పంజాబ్‌లోని లూథియాన, పశ్చిమ, గుజరాత్‌లోని కాడి, విశవదార్ అసెంబ్లీ స్థానాలకు ఈ ఉప ఎన్నిక జరిగింది. బెంగాల్‌లో 70శాతం, గుజరాత్‌లో 54 శాతం, పంజాబ్‌లో 41శాతం, కేరళలో 60 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఉప ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బూత్‌లలో సీసీ కెమెరాలు పెట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఏర్పడింది. పోలింగ్ కేంద్రాల భారీ క్యూ లైన్లు కనిపించాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. కాగా, బెంగాల్‌లోని కాలిగంజ్ స్థానం ఉప ఎన్నిక స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు బలవంతంగా తమ పార్టీ పోలింగ్ ఏజెంట్‌ను తొలగించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఆరోపణను అధికార టీఎంసీ తోసిపుచ్చింది. సాయంత్రం 6 తర్వాత కూడా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు ఉండటంతో ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. కాగా, ఉప ఎన్నికల ఫలితాలు ఈనెల 23వ తేదీన వెలువడుతాయి.

పోలవరంలో 'డీ వాటరింగ్' ప్రారంభం

త్వరలో గ్యాప్ 1 నిర్మాణ పనులు

ఈసీఆర్ఎఫ్ నిర్మాణానికి మార్గం సుగమం

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణ పనులు చేపట్టేందుకు అనువుగా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ ల మధ్య నిల్వ ఉన్న నీటిని తోడివేసే పనిని గురువారం ప్రారంభించారు. పోలవరం ప్రాజెక్ట్ ఈఈ డీ శ్రీనివాస్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈఐఎల్) జనరల్ మేనేజర్ గంగాధర్ ఈ సందర్భంగా డీ వాటరింగ్ జరిగే ప్రాంతంలో పూజలు నిర్వహించారు. ఆ తరువాత నీటి తోడకాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా ప్రారంభించారు. పోలవరం ప్రాజెక్ట్ గ్యాప్ 1 నిర్మించాలంటే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య నిర్మాణ ప్రాంతంలో నీటి మట్టం తక్కువగా ఉండాలి. ప్రస్తుతం అక్కడ 16 మీటర్ల కంటే ఎక్కువ నీటి మట్టం ఉంది. అది 15 మీటర్ల కంటే తక్కువకు చేరే వరకు నీటి తోడకం చేపడతారు. ఈసీఆర్ఎఫ్ లో భాగంగా గ్యాప్ 1 నిర్మాణాన్ని ఆ వెంటనే చేపడతారు. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అనువుగా ప్రస్తుతం అక్కడ మట్టి తవ్వకం పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం నీటి నిల్వలను తగ్గించేందుకు 80 హార్స్ పవర్ సామర్థ్యం ఉన్న 180 మోటార్లను వినియోగించనున్నారు. ఇప్పటికే 86 మోటార్లను సిద్ధం చేశారు. తొలిరోజు 15 మోటర్లతో నీటి తోడకం ప్రారంభించారు. మోటర్లను క్రమక్రమంగా పెంచుకుంటూ పోతామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

సోనియాగాంధీ డిశ్చార్జ్

న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కోలుకున్నారు. ఆమె ఆసుపత్రి నుంచి గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఉదర సమస్యలతో బాధపడుతున్న ఆమె జూన్ 15న దిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా చికిత్స పొందిన సోనియా గాంధీ ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జ్ అయ్యారు. సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని, డిశ్చార్జ్ చేసినట్లు ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు.

మానేరు రివర్ ఫ్రంట్ పనులపై విజిలెన్స్ విచారణ

సీఎం రేవంత్‌కు చాడ వినతి

విశాలాంధ్ర-హైదరాబాద్: కరీంనగర్‌లోని మానేరు రివర్ ఫ్రంట్ పనులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన సీఎంను కలిసి విన్నవించారు. సంబంధిత గుత్తేదారుపై, గత పాలకుల పాత్రపై కూడా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం రూ.500 కోట్లు మంజూరు చేసింది. అందులో టూరిజం శాఖ రూ.100 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ. 100 కోట్లు నిధులు విడుదల చేసింది. గత ప్రభుత్వ కాలంలోనే ఈ రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులు చేపట్టగా... నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా గుత్తేదారు నిర్లక్ష్యం వహించారు. పనులు కూడా పూర్తి కాకుండానే బిల్లులు చెల్లించారు. నిర్మాణంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయి. రివర్ ఫ్రంట్ పరిధిలో చెక్ డ్యాములు నిర్మిస్తే వర్షాకాలంలో కురిసిన వర్షాలకు అవి పూర్తిగా కొట్టుకుపోయాయి. చెక్ డ్యాములు కొట్టుకపోయిన తరువాత కూడా రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ఈ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. కాబట్టి మానేరు రివర్ ఫ్రంట్ పనులలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, పనులు పూర్తి చేయాలని సీఎంకు చాడ విన్నవించారు.

చంద్రబాబు హామీల అమలుపై పోరాటం

మాజీ సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏడాది చంద్రబాబు పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6తో పాటు ఇతర హామీల అమలుపై పోరాడదామని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మీ ఇంటికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాగానే మేనిఫెస్టోతోపాటు బాండ్లను చూపి, తమకు పడిన బాకీ ఎప్పుడిస్తారని నిలదీయాలన్నారు.ఇందుకు 'రీకాలింగ్ ఆఫ్ చంద్రబాబు మేనిఫెస్టో (చంద్రబాబు మ్యానిఫెస్టో గుర్తు తెచ్చుకుంటూ)' అంటూ మీకు క్యూఆర్ కోడ్ ద్వారా దాన్ని వైసీపీ అందుబాటులోకి తెస్తుందన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జగన్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతలు, పాలనా వైఫల్యాలు, మోసాలు, అబద్ధాల మధ్య చంద్రబాబు పాలన సాగుతోందని ఆరోపించారు. ఏడాది గడిచే నాటికే ప్రభుత్వంపై ఇంత తీవ్ర వ్యతిరేకత రావడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. పల్నాడు జిల్లాలో తన పర్యటన కర్ఫ్యూ పరిస్థితుల మధ్య జరిగిందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు, కార్యకర్తల్లో విప్లవం వచ్చిందన్నారు. ఇటీవల జరిగిన పొదిలి పర్యటనలో కుట్రకు ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, జగన్ చుట్టూ ఉన్న వారిని భయపెట్టాలని చూస్తున్నారన్నారన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం బాధాకరమని, వ్యూహాత్మకంగా సాక్షిపై టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జగన్ వివరించారు. బాలికలపై అత్యాచారాలు జరుగుతుంటే ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌తోపాటు ప్రజలకిచ్చిన 143 హామీలను అటకెక్కించారని ఆరోపించారు. ఏడాది కాలంలో చంద్రబాబు రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల బాదుడు, ప్రభుత్వ కళాశాలను, పాఠశాలలను చంపేసి... తద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు పెంచేలా చేయడం, అన్ని రకాల పన్నులు, హెరిటేజ్ కోసం అమూల్‌ను చంపేసి పాలరేట్లు పెంచడం, ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే వాహనాలు తీసేయడం, ఏకంగా 3 లక్షలకు పైగా ఉద్యోగాలు తీసేయడం వంటి ఘనకార్యాలు చేశారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి ఇవ్వలేదని, ఉన్న పీఆర్సీ రద్దు చేశారన్నారు. కొత్త పీఆర్సీ నియామకం లేదన్నారు. రాష్ట్రంలో అప్పులు పెరుగుతుండగా...ఆదాయం మాత్రం తగ్గుతోందన్నారు. మీడియా అడిగిన ప్రశ్నలకు జగన్ జవాబిస్తూ. .గోదావరి-బనకచర్ల చాలా పెద్ద ప్రాజెక్టు అని, దాన్ని దశలవారీగా చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే సమయంలో రాయలసీమ ప్రాజెక్టుల్లో కొన్ని పనులు పూర్తి చేయాలని, కాలువల మరమ్మతు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏడాదిలో నాలుగు నెలలే నీరు అందుబాటులో ఉంటుంది కాబట్టి, దానికి అనుగుణంగా దశల వారీగా పనులు చేయాలని చెప్పారు.

సుగుణమ్మ ధైర్యం నిరుపమానం

నిజాం సైన్యం, రజాకార్లపై పోరాడిన ధీశాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర- హైదరాబాద్: నిరంకుశ నిజాం సైన్యం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు శాఖమూరి సుగుణ ధైర్యం చాలా గొప్పదని, దోపిడీ, అసమానతల యొక్క పునాదిని ప్రశ్నించే ఉద్యమ నిర్మాతల్లో సుగుణమ్మ ఒకరని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ కొనియాడారు. ఇటీవల మరణించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, కమ్యూనిస్టు నాయకురాలు శాఖమూరి సుగుణ భౌతికకాయాన్ని హైదరాబాద్, కొండాపూర్, సీఆర్ ఫౌండేషన్‌లో గురువారం ప్రజల సందర్శనార్థం ఉంచారు.
నారాయణతోపాటు సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులూ కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, బీవీ విజయలక్ష్మి, సీపీఐ మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్ర శేఖర్ రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య, జ్యోతి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి వి.చెన్నకేశవ రావు, సీఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డా. రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె. కల్పన, సభ్యులు వీ లలిత, ఆరుట్ల మమత, పీ ప్రేమ్ పావని, తమ్మారెడ్డి తాన్యా, ప్రముఖ కవి డా. ఎస్వీ సత్యనారాయణ తదితరులు శాఖమూరి సుగుణ భౌతికకాయంపై ఎర్ర జండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న మహిళా ప్రముఖుల్లో శాఖమూరి సుగుణమ్మ ఒకరని గుర్తు చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలుగా మహిళా ఉద్యమానికి ఆమె కొత్త మలుపు తీసుకొచ్చారని చెప్పారు. మహిళలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించి... ఉద్యమంలో పాల్గొనమని ప్రోత్సహించారని, కమ్యూనిస్టు పార్టీకి, మహిళా సమాఖ్యకు ఆమె చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని నారాయణ కొనియాడారు.

ట్రంప్, మోదీ...ఎవరి చెప్పేది నిజం?

పహల్గాం ఉగ్రదాడి... ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే నివారించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతుండగా... భారత ప్రధాని నరేంద్రమోదీ పాకిస్థాన్ ఫోన్ చేసి వేడుకుంటేనే యుద్ధాన్ని ఆపినట్లు చెప్పుకుంటున్నారని... వీరిద్దరిలో ఎవరు అబద్ధం చెబుతున్నారు? ఎవరు నిజం చెబుతున్నారనేది మిలియన్ దాలర్ల ప్రశ్నగా మారిందని నారాయణ పేర్కొన్నారు. ఇరువురి మాటలు పరిశీలిస్తే...ఎవరు చెప్పేది నిజమో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పాకిస్థాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసిన మాట వాస్తవమే అయినప్పటికీ అదే రీతిలో యుద్ధాన్ని కొనసాగిస్తూ భారత సైన్యం పీఓకేని ఆక్రమించుకుంటారని అనుకుంటున్న తరుణంలో ట్రంప్ సూచనలకు కట్టుబడి మోదీ యుద్ధం ఆపారని వార్తలొచ్చాయన్నారు. దీనిపై స్పష్టమైన అవగాహన రావాలంటే ప్రధాని పార్లమెంట్‌ను సమావేశపర్చి నిజాలు చెప్తే బాగుంటుందని, బయట ఏం చెప్పినా ప్రయోజనం ఉండదన్నారు. తక్షణం పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన తెలిపారు.

56వ పడిలో రాహుల్

ప్రధాని మోదీ, ఖడ్గే సహా ప్రముఖుల శుభాకాంక్షలు

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గురువారం ఆయనకు 55 ఏళ్లు నిండుతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్ యాదవ్, తేజస్వీయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. "లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందుకోవాలి" అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో జీవించాలని కోరుకుంటున్నాను' అని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. తన ఆదర్శ సోదరుడు రాహుల్ గాంధీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలని స్టాలిన్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం రాహుల్ గాంధీ దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి చేరుకోగా... పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందజేసి అభినందనలు తెలిపారు. "రాజ్యాంగ విలువల పట్ల మీ నిస్సందేహమైన అంకితభావం, లక్షలాది మంది ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం పట్ల మీ లోతైన కరుణ మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి" అంటూ రాహుల్‌ను ఖడ్గే 'ఎక్స్' వేదికగా అభినందించారు. 'లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ఆయన పుట్టినరోజు శుభాకాంక్షలు. దేవుడు ఆయనను ఆరోగ్యంగా, సంతోషంగా, సంపన్నంగా ఉంచాలని కోరుకుంటున్నాను" అని లాలు ప్రసాద్ యాదవ్ అన్నారు. ఇంకా ఇండియా కూటమికి చెందిన అనేకమంది ఎంపీలు, నాయకులు రాహుల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన శుభాకాంక్షలు తెలిపిన రాహుల్ ధన్యవాదాలు తెలుపుతూ... "కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే జీ, మా నాయకులు, కాంగ్రెస్ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, బలం ప్రతిరోజూ నాకు స్ఫూర్తినిస్తాయి. మనం సత్యం కోసం, న్యాయం కోసం, భారతదేశం కోసం కలిసి నిలబడతాము" అన్నారు.

విద్యలో ఏఐ టూల్స్ వినియోగం

బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో మంత్రి లోకేశ్

స్కిల్, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్‌కు సహకారంపై ఎంవోయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ) వ్యవస్థాపకుడు టోనీ బ్లెయిర్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ న్యూదిల్లీలో భేటీ అయ్యారు. తాజ్ ప్యాలెస్‌లో టోనీ బ్లెయిర్ ను మంత్రి కలుసుకుని వివిధ అంశాలపై చర్చించారు. గత ఏడాది జులైలో ఆయనను మంత్రి ముంబైలో కలిశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్ ను ఉపయోగించ దానికి తమ సంస్థ అయిన టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ ద్వారా సహకరించేందుకు అంగీకరించారు. ఆ మేరకు విద్యారంగంలో అధునాతన సాంకేతికతను అమలుచేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఏపీ విద్యాశాఖ, టీబీఐ నడుమ 2024 డిసెంబర్ లో ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా టీబీఐ విజయవాడలో తమ ఎంబెడెడ్ బృందాన్ని మోహరించి రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తోంది. అందులో ఒకటి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో సంస్కరణలు. రెండోది గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ స్థాపన. ఒప్పందం తర్వాత ఏ మేరకు పురోగతి సాధించారనే అంశంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న నైపుణ్యాభివృద్ధి అజెండా, స్కిల్ సెన్సస్, దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై చర్చించారు. గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సలహాబోర్డులో చేరాల్సిందిగా టోనీ బ్లెయిర్‌ను మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. నైపుణ్య శిక్షణ అంశాలు... గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపన కు సహకారం పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-టీబీఐ మధ్య ఒప్పందం కుదిరింది. ఆగస్టులో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రాల విద్యామంత్రుల కాంక్లేవ్‌కు భాగస్వామిగా ఉంటుందని టోనీ బ్లెయిర్ అన్నారు. విద్య శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతిలో స్పోర్ట్స్ సిటీ: కేంద్ర మంత్రికి వినతి

అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మన్సుఖ్ మాండవీయకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు. క్రీడల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది.

ప్రపంచస్థాయి శిక్షణ, సౌకర్యాలను కల్పించడం, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వివిధ క్రీడావిభాగాల్లో అథ్లెట్లకు మద్దతు నివ్వడం స్పోర్ట్స్ సిటీ ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ ను స్పోర్ట్స్ హబ్ గా మార్చడానికి, రాష్ట్రంలోని పాఠశాలలు, గ్రామ స్థాయి నుంచి క్రీడల అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు. కేంద్రమంత్రి స్పందిస్తూ ఏపీని స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం, ఈఎస్ఐ హాస్పిటల్స్ సేవలను మరింత విస్తృత పరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని ఆయనకు అందజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.